Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 138 మేడ్చల్ మల్కాజ్‌గిరి 9 జూన్ 2023 శుక్రవారం పేజీలు : 4

### విద్యుత్ షాక్!, జూలై నుంచి చార్జీల పెంపు

చెన్నై : రాష్ట్ర ప్రజలకు విద్యుత్ షాక్ కొట్టనుంది. రుణభారంతో కొట్టుమిట్టాడుతున్న విద్యుత్ బోర్డు జూలై నుంచి చార్జీలను పెంచాలని నిర్ణయించింది. విద్యుత్ క్రమబద్ధీకరణ మండలి నిబంధన మేరకు యేటా జూలైలో విద్యుత్ చార్జీలను పెంచాల్సి ఉంటుంది. ఆ మేరకు జూలై నుంచి గృహోపయోగ విద్యుత్ కనెక్షన్ల విద్యుత్ చార్జీ 11 పైసల వరకూ పెంచనున్నారు. ఉదాహరణకు ప్రస్తుతం 100 యూనిట్లకు పైగా విద్యుత్‌ను వాడితే యూనిట్‌కు చెల్లిస్తున్న రూ. 2.25 విద్యుత్ చార్జీ ఇకపై రూ. 2.36కు పెరగనుంది. ఇదే విధంగా 400 యూనిట్ల వరకు విద్యుత్‌ను వాడితే యూనిట్‌కు రూ. 4.60 చొప్పున చెల్లిస్తుండగా, ఇకపై రూ. 4.71గా చెల్లించాలి. ఇదే పద్ధతిన తక్కిన టారిఫ్ విద్యుత్ చార్జీలు కూడా పెరగనున్నాయి.

## తెలంగాణలో కొనసాగుతున్న

# సమీకృత అభివృద్ధి



## వేములలో ఎస్‌జీడీ ఫార్మా కార్నింగ్ టెక్నాలజీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి కేటీఆర్

మహబూబ్‌నగర్: తెలంగాణలో సమీకృత అభివృద్ధి కొనసాగుతున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక కంపెనీలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా వేములలో ఎస్‌జీడీ ఫార్మా కార్నింగ్ టెక్నాలజీ ప్లాంట్ నిర్మాణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కరంటు, తాగు, సాగునీళ్లు ఇవ్వనోళ్లు మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారని విమర్శించారు. లైఫ్‌సైన్స్ రంగంలో తెలంగాణ అగ్రగామిగా ఉందని చెప్పారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి నాయకత్వంలో దేవరకద్ర నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతున్నదని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధిక చెక్‌డ్యాంలు నిర్మించిన నియోజకవర్గం దేవరకద్ర అని చెప్పారు. దేవరకద్రలో రెండు ప్రభుత్వ దవాఖానల నిర్మాణం చేపడుతామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో దేవరకద్ర నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మంత్రి మల్లారెడ్డి అన్నారు.

మంత్రి కేటీఆర్ కృషితోనే తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ కొనసాగుతున్నదని చెప్పారు. అంతకుముందు భూత్పూర్‌లో మున్సిపల్ పార్కు, ఓపెన్ జిమ్‌లను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మల్లారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

**అమ్మలాంటి ఊరి చెరువుకు ఊపిరి పోసిన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్:** చుక్కనీరు లేక చిక్కిశల్యమైన అమ్మ లాంటి ఊరి చెరువుకు ఊపిరిపోసిన నాయకుడు, గొలుసుకట్టు చెరువుల గోస తీర్చిన పాలకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని మంత్రి కేటీఆర్ అన్నారు. పదేండ్ల క్రితం ఏ చెరువును చూసినా గుండెబరువెక్కిందని, వాటిపై ఆధారపడిన కులవృత్తులకు బతుకుదెరువు లేదన్నారు. కానీ దశాబ్ది ఉత్సవాల వేళ ప్రతి చెరువు.. కరువును శాశ్వతంగా తీర్చిన కల్పతరువుగా మారాయని తెలిపారు. చెరువులకు పట్టిన దశాబ్దాల శిలుమును వదిలించిన విప్లవం పేరే మిషన్ కాకతీయ అని వెల్లడించారు. వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాకు నచ్చిన ఈ పథకం.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రాణం పోసిందన్నారు. పొలిమేరల్లో ఉన్న చెరువును ప్రతి గుండెకు చేరువ చేసిన చరిత్ర ఇదని చెప్పారు. అమృతోత్సవ వేళ మన మిషన్ కాకతీయ దేశానికే ఆదర్శమైందని.. అమృత్ సరోవర్ రూపంలో దేశవ్యాప్తంగా ఆవిష్కృతమైందని తెలిపారు. మండువేసవిలో కూడా మత్తడి దుంకుతున్న చెరువుల సాక్షిగా.. ఈ మహాయజ్ఞంలో మనసుపెట్టి పనిచేసిన ప్రతి ఒక్కరికి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ట్విట్టర్ వేదికగా మంత్రి కేటీఆర్ చెరువుల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఒక్క పథకం అనేక ఫలితాలు ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. పూడిక మట్టితో పంటపొలాల్లో సారం పెరిగిందని, నీటి నిల్వ సామర్థ్యం, భూగర్భ జలమట్టాలు గణనీయంగా పెరిగాయన్నారు. చెరువులపై ఆధారపడ్డ కులవృత్తులకు పూర్వవైభవం లభించిందని చెప్పారు. జీవాలకు, పాడి పశువులకు నీటి కొరత తీరిందన్నారు. పల్లెల్లో పచ్చదనం పెరిగిందని, వాతావరణం మారిపోయిందని తెలిపారు. కాళేశ్వరం నీళ్లతో రాష్ట్ర ప్రభుత్వం చెరువుల కడుపు నింపుతున్నదని వెల్లడించారు.

### నేడు చేప ప్రసాదం పంపిణీ.. అన్ని ఏర్పాట్లు పూర్తి

జూన్ 9వ తేదీన మృగశిర కార్తె సందర్భంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉదయం 8.00 గంటల నుంచి చేపప్రసాదం పంపిణీ చేయనున్నట్లు పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ చేప ప్రసాదం పంపిణీకి ముఖ్యమంత్రి



కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ చేప ప్రసాదం కోసం రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది వస్తుంటారని చెప్పారు. సాధారణ ప్రజలు, వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలకు వేరు వేరుగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి చేప ప్రసాదం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు.

# కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి శూన్యం

## జహీరాబాద్‌లో ఇంటింటికి నల్లాలు పెట్టిన ఘనత కేసీఆర్‌దే - మంత్రి హరీశ్ రావు

సంగారెడ్డి : కాంగ్రెస్ పార్టీ హయాంలో అభివృద్ధి శూన్యమని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకలో మూడు రోజులకు ఒకసారి తాగునీరు వస్తున్నాయని తెలిపారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఆరెకటిక సంఘం నూతన భవనానికి మంత్రి హరీశ్ రావు శంకుస్థాపన చేశారు. అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ.. ప్రజల మీద ప్రేమతో తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకొచ్చామని తెలిపారు. గతంలో జహీరాబాద్‌లో ట్యాంకర్లతో తాగు నీరు ఇచచేవారని.. కానీ సీఎం కేసీఆర్ ఆలోచనతో ఇంటింటికీ నల్లాలు పెట్టి నీళ్లు ఇస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆసుత్రుల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించి మెరుగైన వైద్యం అందిస్తున్నాని చెప్పారు. జహీరాబాద్‌లో 50 పడకల %వీజు% హాస్పిటల్ నిర్మిస్తున్నామని అన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. త్వరలోనే జహీరాబాద్‌లో 700 డబుల్ బెడ్‌రూం ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని అన్నారు. సొంత జాగా ఉన్న వారికి ఇండ్ల నిర్మాణం కోసం రూ. 3లక్షలు లబ్ధిదారుల ఖాతాలో వేయబోతున్నామన్నారు. అదే కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజలకు చేసిందేమీ లేదని మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకలో రూ. 600 పింఛన్ ఇస్తున్నారని.. తెలంగాణలో మాదిరిగా రూ. 2వేల పింఛన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. 24 గంటల కరెంట్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని నిలదీశారు.



## చెరువుల అభివృద్ధితో తాగు, సాగునీటి సమస్య పరిష్కారం : మంత్రి తలసాని



హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ ద్వారా చెరువులు అభివృద్ధి చెంది తాగు, సాగునీటి సమస్య పరిష్కారమైందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని లోటస్ పాండ్ లో నిర్వహించిన చెరువుల పండుగ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాకతీయుల కాలంలో నిర్మించిన చెరువులు సరైన నిర్వహణ, పర్యవేక్షణ లేని కారణంగా పూడిపోవడం, ఆక్రమణలకు గురయ్యాయని చెప్పారు. వీటిని పరిరక్షించి వాటికి పూర్వవైభవం తీసుకురావాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. చెరువుల పునరుద్ధరణతో భూగర్భజలాలు వృద్ధి చెందాయని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ కార్యక్రమం క్రింద రాష్ట్రంలో ఉన్న 46,623 చెరువు కట్టలను పటిష్టపర్చడం, తూములు, కాలువల మరమ్మతులు వంటి అభివృద్ధి చేపట్టారని తెలిపారు. దీంతో నేడు చెరువులు నిండుగా నీటితో కళకళ లాడుతున్నాయని వివరించారు. చెరువుల అభివృద్ధి తో పాటు పరిసరాలు ఎంతో సుందరంగా మారి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందని అన్నారు. నూతన రిజర్వాయర్ ల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యాం ల నిర్మాణంతో గణనీయంగా భూగర్భ జలాలు పెరిగాయని, తద్వారా సాగుభూమి విస్తీర్ణం పెరిగి పంటల దిగుబడి భారీగా పెరిగిందని వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నీటి వనరులలో చేప పిల్లలను విడుదల చేయడం వలన అటు మత్స్యకారులు, సమృద్ధిగా సాగునీటి లభ్యతతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. అనంతరం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రూపొందించిన పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్లు మన్నే కవిత, సంగీత, వెంకటేష్, గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ప్రసన్న, జోనల్ కమిషనర్ రవి కిరణ్, ఆర్డీవో వసంత, సీఈ సురేష్ అధికారులు పాల్గొన్నారు.

## చెరువుల పునరుద్ధరణతో కులవృత్తులకు జీవం : మంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్ : ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధిస్తుందని రాష్ట్ర గిరిజన, స్త్రీ ,శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం వల్ల అటు వ్యవసాయంతో రైతులు, చెరువులపై ఆదారపడ్డ కులవృత్తులకు పునర్జీవం కల్పించారని కొనియాడారు. సీఎం కేసీఆర్‌కు ఉన్న విజన్‌తోనే దేశంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో నెంబర్‌వన్ గా నిలిచింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 19 లక్షల ఎకరాలకు సాగు పెరిగిందని అన్నారు. ఏడాదికి రెండు పంటలు పండేలా చేశారని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. నాడు చేపల దిగుమతి చేసుకునే స్థాయి నుంచి నేడు ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రంలో మత్స్య సంపద పెరిగిందన్నారు. చెరువులో కోట్లాది ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా గంగపుత్రులు జీవనోపాధి పెరిగిందని పేర్కొన్నారు. అంతరించి పోతున్న కులవృత్తులను కాపాడుకోవడానికి, గ్రామీణ ప్రాంతాలు కళకళలాడేలా రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఎంపీ మాలోత్ కవిత, జడ్పీ చైర్‌పర్సన్ కుమారి అంగోత్ బిందు, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ, మత్స్యశాఖ జిల్లా అధికారి నాగమణి, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## దేశంలో ఎన్నికల మూడ్ లేదా...?

ఎన్నికల ఏడాది ఇది. అంతా మరచిపోతున్నారా అనిపిస్తోంది. 2024 ఇదే సమయానికి కొత్త ప్రభుత్వం కొలువు తీరిపోయి పాలిస్తుంది కూడా. షెడ్యూల్ ప్రకారం సార్వత్రిక ఎన్నికలు చూసుకుంటే కచ్చితంగా పది నెలలు సమయం మాత్రమే ఉంది. ఎందుకంటే 2024 మార్చి రెండవ వారంలోనే ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. ఆ మీదట ఏప్రిల్ నుంచి మే దాకా ఎన్నికలు దశలవారీగా జరుగుతాయి. మే మూడవ వారం తరువాత ఫలితాలు వస్తాయి. అంటే ఎన్నికలకు పెద్దగా టైం అయితే లేదు. కానీ దేశంలో మాత్రం ప్రధాన రాజకీయ పార్టీలకు మాత్రం ఆ వేడి ఇంకా పుట్టినట్లుగా కనిపించడంలేదు అంటున్నారు. నిజానికి అమెరికాలో ఎన్నికలు అయితే ఎక్కడా పెద్దగా హడావుడి ఉండదు. ఎక్కడికక్కడ డిబేట్స్ పెడుతూంటారు. వాటి నుంచే ఆ ఎన్నికల సెగ కనిపిస్తుంది. దానికి పూర్తిగా భారతదేశం భిన్నం. ఇక్కడ ఎన్నికలు ఏడాదిలో ఉండగానే పెద్ద ఎత్తున రచ్చ స్టార్ట్ అవుతుంది. అయిన దానికీ కాని దానికీ కూడా యాగీ చేస్తూ విపక్షం ఒక్క లెక్కన చెలరేగితే అధికార పక్షం కూడా అడ్డుకోవడానికి చూస్తుంది. కౌంటర్ పాలిటిక్స్ స్టార్ట్ చేస్తుంది. అయితే ఈసారి మాత్రం అలాంటి హడావుడి అయితే పెద్దగా కనిపించకపోవడం విశేషం. దానికి కారణం ఇటీవల కర్నాటక ఎన్నికల్లో బీజేపీ కాంగ్రెస్ టోటల్ గా తన శక్తియుక్తుల్ని వాడేశారు. ఒక విధంగా సెమీ ఫైనల్స్ గా ఈ ఎన్నికలను అభివర్ణించారు. ఎవరు ఇక్కడ గెలిచినా రేపటి లోక్ సభ ఎన్నికల్లో ఇవే ఫలితాలు రిపీట్ అవుతాయని కూడా గట్టిగా చాటారు. అలా చాలెంజిగా తీసుకున్న ఈ ఎన్నికల్లో బంపర్ మెజారిటీని కాంగ్రెస్ కొట్టేసింది. దాంతో ఒక్కసారిగా బీజేపీ డల్ అయిపోయింది. నిజానికి ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిచి ఉంటే 2024 సార్వత్రిక ఎన్నికల మీద చేసే హడావుడి వేరే లెవెల్ లో ఉండేది. కానీ బీజేపీ కర్నాటకం మీద పెట్టుకున్న ఆశలు అన్నీ వమ్ము కావడంతో పూర్తి నిరాశలో కూరుకుపోయింది. దాంతో ఆ పార్టీలో పెద్దగా సౌండ్ కనిపించడంలేదు అంటున్నారు. కానీ కాంగ్రెస్ అయితే ఫుల్ జోష్ మీద ఉంది. తమదే రేపటి ఎన్నికల్లో అధికారం అని ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ అయితే మీడియాతో నమ్మకంగా చెప్పుకొస్తున్నారు. కర్నాటక ఎన్నికల ఫలితాల తరువాత ఆయన దేశంలోనే ఉండి కాంగ్రెస్ రాజకీయాన్ని దూకుడు పెంచుతారు అని అనుకున్నారు కానీ అలా జరగలేదు. ఇక బీజేపీ విషయం తీసుకున్నా మోడీ వైపు నుంచి ఎలాంటి కసరత్తు కూడా చేయడంలేదు. బీజేపీకి పట్టు చిక్కినట్లుగా దేశ రాజకీయాలో సీని కనిపించకపోవడంతో అలా సైలెంట్ అయింది అని అంటున్నారు. అయితే కాంగ్రెస్ విషయమే చిత్రంగా ఉంది. పూర్తిగా బీజేపీ వ్యతిరేక ఓటు మీదనే ఆధారపడి కచ్చితంగా మోడీ యాంటీ జనాలు తమనే గద్దెనెక్కిస్తారన్న అతి విశ్వాసంతో ఉంది అని అంటున్నారు. అందుకే గ్రౌండ్ లెవెల్ లో చేయాల్సిన కసరత్తు మొదలెట్టాల్సిన యాక్టివిటీ ఏదీ చేయడంలేదు అని అంటున్నారు. కాంగ్రెస్ కి ఓటు బ్యాంక్ పెద్ద ఎత్తున ఉంది. అది కర్నాటక ఎన్నికల్లో వెనక్కి తిరిగి వచ్చింది. కానీ దేశవ్యాప్తంగా తన ఓటు బ్యాంక్ ని వెనక్కి తెచ్చుకునే వ్యూహాలకు కాంగ్రెస్ పదును పెట్టినట్లుగా కనిపించడంలేదు అంటున్నారు. ఆ విధంగా చేయకపోవడం వ్యూహాత్మక తప్పిదం అవుతుంది అని అంటున్నారు. బీజేపీ వ్యతిరేక ఓటు ఎంత కలసి వచ్చినా సొంత బలం కాంగ్రెస్ పెంచుకోవాల్సిన అవసరం ఉంది అంటున్నారు. కర్నాటక ఎన్నికల్లో బీజేపీని ఓడించి బిగ్ విక్టరీని నమోదు చేసిన కాంగ్రెస్ ఆ హైప్ ని జోష్ ని ఫుల్ గా వాడుకోవడంలో విఫలం అవుతోంది అని అంటున్నారు. ఈ రోజు సెమీఫైనల్స్ రేపు ఫైనల్స్ అంటూ గర్జిస్తూ మొత్తం దేశమంతా కాంగ్రెస్ ని కదనరంగంలోకి దూకించేందుకు కాంగ్రెస్ ముందుకు రావాల్సి ఉంది. కానీ కాంగ్రెస్ అయితే నిబ్బరంగా ఉందా లేక బీజేపీ ఎటూ ఓడిపోతుంది అన్న ధీమాతో ఉందా అన్నది అర్ధం కావడంలేదు అంటున్నారు. రాజకీయాల్లో అతి విశ్వాసం పనికి రాదు అని అంటున్నారు. ఒక్కోసారి అవే ఓడిస్తాయని కూడా చెబుతున్నారు. బీజేపీ సైలెంట్ అయిన వేళ కాంగ్రెస్ దూకుడు పెంచితేనే పాలిటిక్స్ మొత్తం టర్న్ అవుతుంది అంటున్నారు. ఇక బీజేపీ కూడా డల్ గా ఉండడం ఒక విధంగా అందరినీ విస్మయపరుస్తోంది అంటున్నారు.

# సరిహద్దుల్లేని అక్రమాలు



కొత్తగూడెం : ముదిగొండ మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ కార్యకలపాలు జోరుగా సాగుతున్నాయి. ఉక్కుపాదం మోపాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఉభయ రాష్ట్రాల సరిహద్దులో ఇసుక, మట్టి, రేషన్ బియ్యం, గుట్కా, పేలుడు పదార్థాల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. యువత వ్యసనాలకు బానిసలవుతుంటే, ధనార్జనే ధ్యేయంగా కొందరు అక్రమ మార్గాల్లో సంపాదిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. గుట్టుగా వ్యాపారం గుట్కాను నిషేధించినా రూపాయికి రూ. 5 లాభం వస్తుండటంతో కొంతమంది ఈ వ్యాపారాన్ని గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని దుకాణాల్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ముదిగొండ ప్రధాన సెంటర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 30 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను పోలీసులు ఈనెల 4న పట్టుకున్నారు.

యథేచ్ఛగా ఇసుక, మట్టి రవాణా

కొందరు అక్రమార్కులు అనుమతులు లేకుండానే ఇసుక, మట్టి అక్రమ రవాణా చేపడుతున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినా దాడులు నిర్వహించటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో కొందరు ముందస్తుగా ఇళ్లల్లో నిల్వ చేసుకున్న ఇసుకను తరలిస్తున్నారు. మరోవైపు పేకాట జూదం విచ్చలవిడిగా సాగుతోంది.

కళ్లు గప్పుతూ సరఫరా...గ్రానైట్ క్వారీలు, గ్రామాల్లో వెంచర్లు వెలుస్తున్న నేపథ్యంలో స్థలాల్లో ఉన్న బండరాళ్లను పగలగొట్టడానికి పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు. పేలుళ్లకు అనుమతి ఉన్న క్వారీలకు మాత్రమే విక్రయించాల్సి ఉండగా అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇష్టానుసారంగా విక్రయాలు జరుగుతున్నాయి. జిలెటిన్ స్టిక్స్‌ను కార్లలో అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన జనాలు ఉండే ప్రదేశాల్లో ఇవి విస్ఫోటనం చెందిన ఘోర ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు.

కారులో అక్రమంగా తరలిస్తున్న పేలుడు పదార్థాలను ముదిగొండలో గత ఏడాది డిసెంబరు 12న పోలీసులు పట్టుకున్నారు.

ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఓ వ్యక్తిని మే 22న పోలీసులు అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి జిలెటిన్ స్టిక్స్, ఎలక్ట్రికల్ డిటోనేటర్స్, మేకర్ బాక్స్, బైండింగ్ వైరును స్వాధీనం చేసుకున్నారు.

జోరుగా రేషన్ బియ్యం దందా...

పేదల బియ్యం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. లబ్ధిదారుల నుంచి చౌకగా కొనుగోలు చేసి రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారు. పంపిణీ సమయంలోనే లబ్ధిదారుల నుంచి దర్జాగా కొనుగోలు చేస్తున్నారు. కొందరు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ లబ్ధిదారుల నుంచి సేకరిస్తున్నారు. ఆనక అక్రమంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గత ఏడాది నవంబరు 23న రాఘవాపురంలో పోలీసులు పట్టుకున్నారు. బొలేరో ట్రాలీలో అక్రమంగా కృష్ణా జిల్లాకు అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వల్లభిలో గత ఏడాది డిసెంబరు 19న పోలీసులు పట్టుకున్నారు. బొలేరో వాహనంలో కృష్ణా జిల్లాకు అక్రమంగా తరలుతున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని జనవరి 16న పోలీసులు వల్లభిలో పట్టుకున్నారు. టాటాఏస్ ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది క్వింటాళ్ల రేషన్ సరకును జూన్ 20న వల్లభిలో పోలీసులు పట్టుకున్నారు. సుకను అక్రమంగా నిల్వ చేస్తే పరిశీలించి సీజ్ చేస్తాం. ఇసుక, మట్టి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణా చేపట్టే వారిపై చర్యలు తీసుకుంటాం. – దామోదర్, తహసీల్దార్

# సమస్యలకు చెల్లు చీటీ!



అశ్వాపురం: చౌక దుకాణాల్లో ఇప్పటివరకు వివిధ సాంకేతిక సమస్యల వల్ల చౌక దుకాణం డీలర్లు, వినియోగదారులు ఎదుర్కొనే సమస్యలకు చెల్లుచీటి పడింది. కొత్తగా 4జీ ఈ-పాస్ యంత్రాలను అమల్లోకి తెచ్చారు. జిల్లాలో ఉన్న 442 మంది చౌక దుకాణాల డీలర్లకు వీటిని పంపిణీ చేశారు. ఈ నెల నుంచే నూతన విధానాన్ని అమలు చేస్తున్నారు.

యంత్రం ఇలా పనిచేస్తుంది..

4జీ ఈ-పాస్ యంత్రాలు చిన్న పరిమాణంలో ఉంటాయి. 4జీ సిమ్‌తో పాటు యాంటెన్నా ఉంటుంది. వినియోదారుడు వెళ్లగానే డీలరు తన వేలి ముద్రలతో యంత్రాన్ని ప్రారంభిస్తారు. వినియోగదారుడి ఆహారభద్రతా కార్డు సంఖ్యను నమోదు చేస్తారు. తరవాత ఈ-పాస్ వినియోగదారుడి వేలిముద్రలను అడుగుతుంది. వేలిముద్రలు వేయగానే వెంటనే అంగీకారం తెలుపుతుంది. అనుబంధంగా ఉన్న తూనికపై చౌక బియ్యం తూకం వేసి అందజేస్తారు. గతంలో తూనికలు తూకం విషయంలో కూడా మొరాయించేవి. ఈ యంత్రాల అనుబంధ తూనికలకు కచ్చితత్వం ఉంది. మారుమూల గ్రామాల్లో కూడా ఇవి దాదాపుగా 99 శాతం పనిచేస్తున్నాయి.

గతంలో ఇలా..గతంలో చౌక దుకాణాల వద్ద వినియోగదారులు బియ్యం, ఇతర నిత్యావసర సరకులు తీసుకునే క్రమంలో 2జీ, 3జీ ఈ-పాస్ యంత్రాలను వినియోగించేవారు. వీటి వినియోగం వల్ల డీలర్లు, వినియోగదారులు అనేక రకాల సాంకేతిక సమస్యలను ఎదుర్కొన్నారు. జిల్లాలో మారుమూల గ్రామాల సంఖ్య అధికం. అలాంటిచోట్ల సమస్యలు మరీ అధికం. చౌక దుకాణం డీలర్లు ఎక్కడ అంతర్జాల సంకేతాలు ఉంటే అక్కడికి వెళ్లి వినియోగదారుల వేలిముద్రలను సేకరించి బియ్యం, నిత్యావసర సరకులను పంపిణీ చేసేవారు. కొన్ని సందర్భాల్లో రోజుల తరబడి సిగ్నల్లు అందేవి కాదు. అప్పటివరకు డీలర్లు, మరోవైపు వినియోగదారులు వేచి ఉండేవారు. బియ్యం, సరకుల కోసం పనులన్నీ ఆపుకొని వచ్చే వినియోగదారులు పడే బాధలు వర్ణనాతీతం.

నూతన విధానం ఇలా..ఈ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 4జీ ఈ-పాస్ యంత్రాలను అమల్లోకి తెచ్చింది. వినూత్న సాంకేతికతతో కూడిన ఈ యంత్రాలను విజన్ టెక్ కంపెనీ రూపొందించింది. జియో 4జీ సిమ్‌తో కూడిన యంత్రాలను జిల్లాలోని చౌకదుకాణం డీలర్లందరికి పంపిణీ చేశారు. అనుబంధ ప్రత్యేక తూనికలు కూడా ఇచ్చారు. వినియోగంపై శిక్షణనూ ఇచ్చారు. ఈ నెల మొదటి వారం నుంచీ వినియోగంలోకి తెచ్చారు. వీటివల్ల అంతర్జాల సంకేతాల సమస్యల నుంచి విముక్తి లభించింది. "4జీ ఈ-పాస్ యంత్రాల నూతన సాంకేతికతతో డీలర్ల, వినియోగదారుల సమస్యలు తీరాయి. సమయం వృథా కాకుండా ఉంది. పంపిణీ సజావుగా కొనసాగుతుంది."– కొడాలి వెంకటేశ్వరరావు, చౌక దుకాణం డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

# ప్రాథమిక అనారోగ్య కేంద్రాలు

చర్ల : ఆరోగ్య కేంద్రాలు అనారోగ్యంతో కునారిల్లుతున్నాయి. సరైన నిధులు లేక, మౌలిక సదుపాయాలు కరవయ్యాయి. ప్రభుత్వం మంజూరు చేయాల్సిన నిధులు సకాలంలో రావడం లేదు. వచ్చినవీ సక్రమంగా వినియోగించడం లేదు. విద్యుత్తు సౌకర్యం లేక కొన్ని.. మరుగుదొడ్లు లేక.. మంచినీటి సౌకర్యానికి నోచుకోక.. ప్రహరీలు లేక ఆయా కేంద్రాల్లో వైద్య సేవలు నామమాత్రమయ్యాయి. దీంతో సామాన్యుడికి సర్కారు వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల దుస్థితిపై ప్రత్యేక కథనం...జిల్లాలోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో చిన్నపాటి సౌకర్యాల లేకున్నా దానిని సాకుగా చూపి సిబ్బంది స్థానికంగా ఉండటం లేదు. ఫలితంగా రాత్రివేళ గ్రామాల్లో గర్భిణులు.. ప్రాణాపాయ స్థితిలో పరిస్థితి దయనీయంగా మారుతోంది. దూరంలోని గ్రామాల నుంచి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని పీహెచ్‌సీలకు తీసుకొచ్చేలోగానే ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. కనీసం మరుగుదొడ్లు లేని ఆరోగ్య ఉప కేంద్రాలు అనేకం ఉన్నాయి. ఉన్నవీ నీరు లేక పని చేయడం లేదు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో సౌకర్యాలు లేవనే సాకుతో చాలాచోట్ల వైద్య సిబ్బంది కార్యక్షేత్రాల్లో ఉండకుండా రాకపోకలు సాగిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో పిన్ పాయింట్ కార్యక్రమాలను మమ అనిపిస్తున్నారు. మహిళా ఆరోగ్య కార్యకర్త ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలను వారానికి ఓ పర్యాయం.. మగ ఆరోగ్య కార్యకర్త 15 రోజులకోసారి నిర్దేశించిన రోజుల్లో సందర్శించాల్సి ఉంటుంది. వ్యాధులు ప్రబలే సమయంలోనూ సమయపాలన పాటించని దుస్థితి చాలాచోట్ల కనిపిస్తోంది.

కొత్త భవనాలకు నిధుల కేటాయింపు

జిల్లాలో అద్దె భవనాల్లో నడుస్తున్న ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాలకు ఐటీడీఏ నిధులు మంజూరు చేసింది. మొత్తంగా 85 పక్కా భవనాల నిర్మాణాలకు రూ. 13.60 కోట్లతో నిధులు మంజూరయ్యాయి. 30 భవనాల వరకు పూర్తయ్యాయి. మరో 40 భవనాలు నిర్మాణాలు సాగుతున్నాయి. జిల్లాలో శిథిలావస్థకు చేరుకున్న కుర్నపల్లి, మామిడిగూడెం(చర్ల), మారాయిగూడెం, నందిపాడు,

అన్నపురెడ్డిపల్లి, ములకపాడు ఆరోగ్య ఉప కేంద్రాలకు రూ. 1,12,00,000లను ఐటీడీఏ మంజూరు చేసింది.

పారదర్శకతేదీ

ఆరోగ్య ఉప కేంద్రాలకు ఏటా అన్‌టైడ్ నిధులు రూ. 10 వేలు, జాతీయ ఆరోగ్య మిషన్–2005 ద్వారా వీలేజ్ హెల్త్ శానిటేషన్ కమిటీకి రూ. 10 వేల చొప్పున నిధులు మంజూరవుతున్నాయి. వీటి వాడకంలో పారదర్శకత లేక ఏళ్లుగా వస్తున్న నిధులతో కనీస మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అంకురార్పణ జరగకపోవడం వాటి దుస్థితికి అద్దం పడుతున్నాయి. గత ఏడాది నుంచి ఈ నిధులు మంజూరు కాలేదని చెబుతున్నారు.

సమయపాలన పాటించాల్సిందే: దయానందస్వామి, జిల్లా వైద్యాధికారి

జిల్లాలో దాదాపు అన్ని ఆరోగ్య కేంద్రాలకు విద్యుత్తు సౌకర్యం ఉంది. మౌలిక సదుపాయాలు ఉన్నా.. లేకున్నా కనీసం ఉదయం నుంచి సాయంత్రం వరకు సిబ్బంది కేంద్రాల్లో విధిగా ఉండాల్సిందే. ఈ ఏడాది అన్‌టైడ్ నిధులు రావాల్సి ఉంది. ఆ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించుకోవాలని గతంలోనే చెప్పాం. మరుగుదొడ్లు లాంటివి నిర్మించుకోవాలని సూచించాం. క్షేత్రస్థాయిలో వైద్య సేవల్లో డుమ్మా కొడితే సహించేది లేదు.

# అద్దె యంత్రం.. ఆర్థిక మంత్రం

సంగారెడ్డి : మహిళా సంఘాల బలోపేతానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కృషి చేస్తోంది. సంస్థ పరిధిలోని పొదుపు మహిళలు.. వ్యాపారవేత్తలుగా ఎదగడానికి చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే సాగును కొత్త పుంతలు తొక్కించనున్నారు. మండల మహిళా సమాఖ్యల ద్వారా వ్యవసాయ అనుబంధ యంత్ర, పరికరాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇదే క్రమంలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సదరు వనితల కుటుంబాల సాగుకు, గ్రామంలోని చిన్న, సన్నకారు రైతులకు దోహదం చేసేలా.. కస్టమ్ హైరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. మరికొన్ని నెలకొల్పేందుకు అడుగు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాల వల్ల ఒనగూరే ప్రయోజనాలపై కథనం. వర్షాకాలం వచ్చిందంటే సాగు ఊపందుకుంటుంది. ఈ క్రమంలో వ్యవసాయ పరికరాలకు డిమాండ్ పెరుగుతుంది. అద్దెకు తీసుకుందామనుకున్నా కొన్ని చోట్ల దొరకని పరిస్థితి. ఈ అద్దె యంత్రాల డిమాండ్‌ను గుర్తించిన ప్రభుత్వం అద్దె యూనిట్లను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసి వీటి ద్వారా లబ్ధి పొందేలా చర్యలు చేపట్టింది. మహిళా సంఘాలు ట్రాక్టరు, ఇతర పరికరాలు అద్దెకు ఇచ్చి ఆదాయం ఆర్జించేలా ప్రణాళిక రూపొందించిన అడుగులు వేయిస్తున్నారు. ఇప్పటికే నాలుగు జిల్లాల్లో పలు చోట్ల ఏర్పాటుచేయించగా.. ఆయా వాటి కొనుగోలుకు రుణాలు మంజూరు చేశారు. వచ్చే ఆదాయంలో నెలవారీ వాయిదాలు పక్కాగా చెల్లిస్తున్నారు.

ప్రయోజనం చేకూరేలా..అద్దె యంత్రాలను రైతులకు ఉపయోగపడేలా ఆయా పరికరాలను ఈ కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంచుతున్నారు. ఒక్కో యూనిట్‌లో ట్రాక్టర్, ప్యాడీ కటింగ్, స్ప్రేయర్లు,



వరినాటే యంత్రాలు, రోటోవేటర్లు, పత్తిని ఏరే మిషన్లు, నాటువేసే యంత్రాలు, కల్టివేటర్లు ఇలా ఎక్కువగా డిమాండ్ ఉన్న యంత్రాలు రూ. 25 లక్షల వరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకు రైతులకు అద్దెకు ఇస్తుండటం గమనార్హం.

నాలుగు జిల్లాల్లో ఇలా.. మెదక్ జిల్లాలో తొలి విడతగా చిన్నశంకరంపేట మండలాన్ని పైలట్‌గా ఎంపిక చేసి రూ. 25 లక్షలు రుణం లేకుండా రాయితీ కింద ఇచ్చి అద్దె కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ సత్ఫలితాలు దక్కడంతో రెండో విడతగా నర్సాపూర్, చేగుంట మండలాల్లో సైతం ప్రారంభించారు. రెండో విడత నుంచి రూ. 25 లక్షలు బ్యాంకు ద్వారా రుణం అందించి వాయిదాలు చెల్లించేలా నిర్ణయించారు. ఇటీవల మూడో విడతగా పెద్దశంకరంపేట, కొల్చారం, వెల్దుర్తి మండలాలను ఎంపిక చేశారు. సిద్దిపేట జిల్లాలో మండల సమాఖ్యల ఆధ్వర్యంలో జగదేవపూర్, గజ్వేల్, దౌల్తాబాద్, కొండపాక మండలాల్లో కొనసాగుతున్నాయి. మరో 15 చోట్ల ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. మండల సమాఖ్యలు, వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో కావాల్సిన యంత్ర పరికరాలు గుర్తించారు. ఇటీవల జిల్లాలోని గ్రామీణాభివృద్ధి సంస్థకు ప్రతిపాదనలు పంపించగా.. 25 శాతం మేర నిధులు రూ. 46.60 లక్షల ఆయా మండల సమాఖ్యలకు అందాయి. మరో మూడింటికి ప్రతిపాదనలు సమర్పించారు. వికారాబాద్ జిల్లాలో ఆరు రైతు ఉత్పత్తిదారు సంస్థలు ఉన్నాయి. కుల్కచర్ల మండలంలోని రామలింగేశ్వర సిరి ధాన్యాల రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ట్రాక్టర్, కల్టివేటర్, రోటోవేటర్ తదితర వాటిని అద్దెకు సన్న, చిన్నకారు రైతులకు ఇస్తున్నారు. దీని ద్వారా ఇప్పటివరకు రూ. 16,29,535 లక్షల టర్నోవర్ చేకూరింది. 412 మంది రైతులు సద్వినియోగం చేసుకున్నారు. జిల్లాలో మరో 13 కేంద్రాల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో కోహీర్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో రెండేళ్ల కిందటే ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేసి నిర్వహిస్తున్నారు. తాజాగా కొండాపూర్, అందోలు మండల సమాఖ్య ఆధ్వర్యంలోనూ వీటిని ప్రారంభించారు. ట్రాక్టర్లు, ఇతర యంత్ర సామగ్రి నిర్వహణ బాధ్యతను మండల సమాఖ్య చూస్తోంది. మరో 13 మండలాల్లో కేంద్రాల ఏర్పాటుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు ప్రతిపాదనలు పంపించారు.

# గర్భిణి కాలినడక ఘటనపై మంత్రి ఆరా

గజ్వేల్ : రోడ్డు బాగాలేక కొంత దూరం కాలినడక సాగించి 108 సహాయంతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చెరిన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం చందాపూర్ గ్రామానికి చెందిన సంధ్య బుధవారం సాధారణ కాన్పులో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామానికి వచ్చే రోడ్డు కొట్టుకుపోవటంతో వాహనాల రాకపోకలకు వీల్లేకుండా పోయింది. నల్గొండ జిల్లా మోటకొండూరు నుంచి రెండో కాన్పుకు పుట్టినిల్లు చందాపూర్‌కు వచ్చిన సంధ్యకు పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం



ఇచ్చారు. ఆశా వర్కర్ భూలక్ష్మి, కుటుంబీకుల సాయంతో కాలినడకన తీసుకువెళ్లి అక్కడి నుంచి వాహనంలో వర్గల్ పీహెచ్‌సీకి చేర్చారు. విషయం తెలిసిన మంత్రి హరీశ్‌రావు ఘటనపై వైద్యులను ఆరా తీసి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ అంశంపై 'నిండు చూలాలి నడక' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి సర్పంచి రాములు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేయించా రు. రోడ్డు వేసి శాశ్వత పరిష్కారం చూపాలని భాజపా వర్గల్ అధ్యక్షుడు శ్రీకాంత్ పీఆర్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

# అద్దె సొమ్ము చెల్లింపులో చేతివాటం..!

మహబూబాబాద్: చేతికొచ్చిన పంట విక్రయానికి అష్టకష్టాలు పడుతున్న అన్నదాతలు.. అద్దె చెల్లించి వాహనాల్లో ధాన్యం బస్తాలను మిల్లులకు తరలిస్తే ఆ సొమ్ము రాక అవస్థ పడుతున్నారు. నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన బస్తాలను నిర్వాహకులే లారీల ద్వారా మిల్లులకు తరలించాలి. వాహనాల కొరత కారణంగా.. సమయం వృథా అవుతుండడం..వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులే ట్రాక్టర్లు, డీసీఎం, తదితర వాహనాలకు అద్దె చెల్లించి బస్తాలను మిల్లులకు తరలిస్తున్నారు. ట్రక్‌షీటు ఇస్తే కిరాయి చెల్లిస్తామని చెప్పిన నిర్వాహకులు పౌరసరఫరాల శాఖ నుంచి తమకు అందలేదంటూ దాట వేస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను సంప్రదిస్తే ఎప్పుడో చెల్లించామంటున్నారు. ఆ సొమ్ము లారీలు ఏర్పాటు చేసిన గుత్తేదారులు, నిర్వాహకులు జేబుల్లో వేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలంటూ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.12.84 కోట్ల చెల్లింపు

వానాకాలం, యాసంగి ధాన్యం కొనుగోలు చేయడానికి పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా, జీసీసీ, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తారు. ఆ కేంద్రాల్లో కాంటాలు వేసిన బస్తాలను మిల్లులకు తరలించడానికి లారీలు ఏర్పాటు చేసేందుకు ఐదు సెక్టార్లను ఏర్పాటు చేసి టెండర్ ద్వారా గుత్తేదారుకు బాధ్యతలు అప్పగిస్తారు. తూకం వేసిన బస్తాల నిల్వలు పేరుకుపోతుండగా లారీల కొరత ఏర్పడడంతో రైతులే అద్దె చెల్లించి వాహనాల ద్వారా మిల్లులకు బస్తాలను తీసుకెళ్తున్న తీరు 2020 నుంచి కొనసాగుతోంది. కిరాయి డబ్బులను బ్యాంకు ఖాతాల్లో జమ చేయకుండా గుత్తేదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. 2021-22 యాసంగి కాలానికి సంబంధించి గుత్తేదారు ఏర్పాటు చేసిన లారీలు, రైతులు సమకూర్చిన అద్దె వాహనాల కిరాయి డబ్బులను గుత్తేదారు బ్యాంకు ఖాతాలో రూ.3,33,32,723, 2022-23 వానాకాలానికి సంబంధించి రూ.9,51,10,792 జమ చేసినట్లు అధికారులు తెలిపారు. రెండు పంటకాలాలకు రూ.12.84 కోట్ల రవాణా డబ్బులను గుత్తేదారు ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు ఇచ్చిన లెక్కలు చెబుతున్నాయి. నిర్వాహకులు, గుత్తేదారులు కలిసి లెక్క ప్రకారంగా వారి వద్ద ఉన్న జాబితా ఆధారంగా అన్నదాతలకు డబ్బులు చెల్లించాల్సి ఉండగా వారు చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులకు కూడా కొంత వాటా ముట్టినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

కిరాయి సొమ్ము రాలేదంటున్నారు- గుండ సునీల్, చిన్నముప్పారం

గత వానాకాలంలో 133 బస్తాల ధాన్యాన్ని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో విక్రయించా. ఆ సమయంలో లారీలు రాకపోవడంతో ట్రాక్టర్‌కు రూ. 2500 అద్దె చెల్లించి కేసముద్రంలోని మిల్లుకు తరలించాను. ట్రక్‌షీట్ ఇస్తే కిరాయి డబ్బులు ఇస్తామన్నారు. వాళ్లు చెప్పినట్లుగా ట్రక్‌షీట్ ఇచ్చాను. కాని అద్దె డబ్బులు ఇవ్వలేదు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగితే రాలేదని చెబుతున్నారు.

రెండు పంట కాలాల డబ్బులు రావాలి- తాడబోయిన చంద్రశేఖర్, చిన్నముప్పారం

రెండు పంటల కాలాల అద్దె డబ్బులు ఇవ్వాల్సిన అధికారులు ఇంకా ఇవ్వడం లేదు. 2021-22 యాసంగిలో 11 టన్నుల ధాన్యాన్ని రూ.6,500 అద్దె చెల్లించి డీసీఎంలో కేసముద్రం మిల్లుకు తరలించా. 2022-23 వానాకాలానికి సంబంధించి 120 బస్తాలు ట్రాక్టర్‌లో, 98 బస్తాలు టాటా ఏసీ ట్రక్కులో రూ.4,500 అద్దె చెల్లించి మిల్లుకు తీసుకెళ్లాను. అప్పుడు పీఏసీఎస్ నిర్వాహకులు వాహనం కిరాయి డబ్బులు ఇస్తామని ట్రక్‌షీట్లు తీసుకున్నారు. ఇంత వరకు ఇవ్వలేదు. అడిగితే అధికారులు మాకు ఇవ్వలేదని చెబుతున్నారు.

అద్దె చెల్లించాలని నిర్వాహకులకు చెప్పాం- కృష్ణవేణి, డీఎం, పౌరసరఫరాలశాఖ

అద్దె చెల్లించి ట్రాక్టర్ల ద్వారా బస్తాలను మిల్లుకు తరలించిన రైతులకు ట్రక్‌షీటు ఆధారంగా కిరాయి డబ్బులు ఇవ్వమని నిర్వాహకులకు చెప్పాం. అన్నదాతలు వారిని సంప్రదిస్తే సరిపోతుంది.

# మట్టి అక్రమ రవాణా అడ్డుకోరా?

మహబూబాబాద్ : కొందరు అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మహబూబాబాద్‌లో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. చెరువులు, కుంటలు, గుట్టలను తవ్వి సహజ సంపదను కొల్లగొడుతూ మట్టి అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. నిబంధనలంటూ అనుమతులు ఇవ్వకుండా తమ కళ్లెదుటే రోజూ వందల ట్రాక్టర్ల మట్టి అక్రమంగా తరలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఇళ్ల నిర్మాణాలు, ఇతర అవసరాలకు మట్టి కావలసినవారి నుంచి రెండింతలు వసూలు చేస్తున్నారు. గతంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మట్టి తరలింపు నకు అనుమతించిన అధికారులు సంబంధిత గుత్తేదారుల మధ్య ఆర్థిక లావాదేవీల్లో వచ్చిన భేదాభిప్రాయాలతో మట్టి తవ్వకాలను నిలిపివేయించారు. ఈ సంఘటన అక్రమదారులకు వరంగా మారింది. నాలుగైదు నెలల నుంచి అక్రమదారులు కొందరు అధికారుల అండదండలతో మట్టిని తరలిస్తున్నారు. అధికారికంగా మట్టి విక్రయాలను నిలిపివేసిన అధికారులు రోజూ ప్రధాన రహదారుల నుంచి వాహనాల్లో మట్టి తరలిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు. దీన్నే సాకుగా తీసుకున్న మట్టి అక్రమ రవాణాదారులు ప్రజల నుంచి రెట్టింపు డబ్బులు వసూలు చేస్తున్నారు. అనుమతులు ఉన్నప్పుడు పట్టణంలో ఒక ట్రాక్టర్‌కు రూ. రూ. 8 వందల వరకు రవాణా ఛార్జీలు వసూలు చేసేవారు ప్రస్తుతం అక్రమంగా తరలిస్తున్నవారు రూ.15 వందల వరకు తీసుకుంటున్నారు. తప్పని పరిస్థితుల్లో అధిక ధరలకు మట్టిని కొనుగోలు చేయాల్సి వస్తుంది.

కుంటల నుంచి రోజూ ..గతంలో అధికారికంగా మొగిలిచెర్ల, కురవి రోడ్‌లో ఉన్న పలు ప్రాంతాల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చేవారు. అనుమతి కంటే ఎక్కువ మట్టిని తరలిస్తున్నారంటూ నిలిపివేయించారు. ప్రస్తుతం పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల ప్రోత్సాహంతో మహబూబాబాద్ తాళ్లపూసపల్లిరోడ్‌లోని అన్నారం, అయోధ్య, బీసీ కాలనీ సమీప ప్రాంతాల నుంచి రోజు వందల ట్రాక్టర్లు తరలిపోతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇల్లందు రోడ్‌లోని గాంధీపురం, నర్సంపేట రోడ్‌లోని బీటీఆర్‌నగర్, ఆర్టీసీ కాలనీ సమీప ప్రాంతాల నుంచి ఈదులపూసపల్లి రోడ్‌లోని చెరువులు, కుంటల నుంచి తరలిస్తున్నారు. ఈ విషయమై గత నెల జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో పాటు కలెక్టర్ శశాంక కూడా మైనింగ్ శాఖాధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు అనుమతి ఇచ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా మట్టిని విక్రయించాలని సూచించారు. పర్యవేక్షణకు సిబ్బంది కొరత ఉంటే సర్దుబాటు చేసుకొని ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చాలని ఆదేశించినా ఆ దిశగా అడుగులు పడలేదు.

# వైద్య సేవలకు 'గుర్తింపు'



వరంగల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా అవసరమైన నిధులు మంజూరు చేసి వసతులు కల్పిస్తున్నాయి. దీంతో పలు ప్రభుత్వ ఆసుపత్రులు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ అవార్డులు సొంతం చేసుకుంటున్నాయి. అందులో భాగంగానే జాతీయ స్థాయిలో అవార్డు అందించే నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్వాష్) అవార్డుకు జిల్లాలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక పల్లె దవాఖానా ఎంపికయ్యాయి. జిల్లాలోని కాటారం, మహాముత్తారం, భూపాలపల్లి మండలం ఆజంనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ధన్వాడ పల్లె దవాఖానా ఈ అవార్డును దక్కించుకున్నాయి. ఔట్, ఇన్ పేషెంట్, లేబొరేటరీ సర్వీసెస్, ఫార్మసీ, ప్రసవాలు, జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల అమలుతో పాటు రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర వాటన్నింటినీ ఎన్‌క్వాష్ అధికారుల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి వారు అందిస్తున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. అన్ని విషయాలను పరిశీలించిన జాతీయ వైద్య ఆరోగ్యశాఖ అధికారుల బృందం మార్కులు కేటాయించి అవార్డులను ప్రకటించింది. మరో వారం రోజుల్లో చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఎన్‌క్వాష్ అవార్డు వచ్చే అవకాశం ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

రాష్ట్రంలోనే మొదటిసారిగా..

ఎన్‌క్వాష్ అవార్డులో భాగంగా జిల్లాలోని కాటారం మండలం ధన్వాడ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌కు అవార్డు వరించింది. ఇలా ఒక పల్లె దవాఖానాకు అవార్డు రావడం రాష్ట్రంలోనే మొదటిసారని సంబంధిత వైద్యశాఖ అధికారులు తెలుపుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలకు ఏమాత్రం తగ్గకుండా మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు కావాల్సిన సౌకర్యాలు ఉండటంతో ఎన్‌క్వాష్ అవార్డుకు ఎంపిక చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 వేలకు పైగా ఆరోగ్య ఉప కేంద్రాలుంటే.. 87 శాతం పాయింట్లతో ధన్వాడ వెల్‌నెస్ సెంటర్ అవార్డు దక్కించుకుంది. తర్వాత స్థానంలో పెద్దపల్లి జిల్లాలోని ఒక వెల్‌నెస్ సెంటర్ ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. ఎన్‌క్వాష్‌కు ఎంపికైన పల్లె దవాఖానాకు రూ.1.20 లక్షలను అందించనున్నారు.

దోహదపడిన అంశాలు

సంబంధిత ఆసుపత్రుల్లో వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించడం. ఎక్కువ సంఖ్యలో ప్రసవాలను చేయడంతో పాటు తాత్కాలికంగా సంతానం వద్దనుకునే వారికి ఐయూసీడీ(కాపర్ టీ) పద్ధతిలో చికిత్స అందించడం. ఆసుపత్రి ఆవరణ, లోపల కార్పొరేట్ ఆసుపత్రుల మాదిరిగా నిత్యం శానిటైజ్ చేయడంతో పాటు పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టడం. జాతీయ ఆరోగ్య మిషన్ చేపట్టే కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించడం.. ఆసుపత్రికి వచ్చిన రోగికి ఒక క్రమపద్ధతి ప్రకారం ఓపీలో వివరాలను నమోదు చేసుకోవడం, వైద్యాధికారి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు ఉంటే చేయించుకునేలా చూడటంతో పాటు రోగి వచ్చిన 10 నిమిషాల్లోపు వారికి వైద్య సహాయం అందేలా చూడటం. లి ఆసుపత్రి ఆరు బయట పచ్చని చెట్లు, పార్కు ఉండటంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటం. లి ఆసుపత్రిలో ఓపీ సేవలు పెరగడం తదితర విషయాలను పరిగణలోకి తీసుకుని ఎన్‌క్వాష్ అవార్డుకు ఎంపిక చేశారు.

కాయకల్ప అవార్డులు సైతం...

జిల్లావ్యాప్తంగా 13 ఆరోగ్య కేంద్రాలు, రెండు సీహెచ్‌సీలు, ఒక్క అర్బన్ హెల్త్ సెంటర్, 90 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. ఏటా జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలు, మంచి సదుపాయాలు ఉన్నటువంటి పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లకు కాయకల్ప అవార్డులను అందిస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది సంబంధించి 8 పీహెచ్‌సీలు, 1 సీహెచ్‌సీ, 11 ఉప కేంద్రాలకు అవార్డులు వరించాయి. మహాముత్తారం, రేగొండ, గణపురం, కాటారం, మొగుళ్లపల్లి, భూపాలపల్లి, ఆజంనగర్, వెలిశాల పీహెచ్‌సీలు ఉన్నాయి. 84 శాతం పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచిన మహాముత్తారం పీహెచ్‌సీకి రూ.2 లక్షల నిధులను అందించగా మిగిలిన ఏడు పీహెచ్‌సీలకు రూ.50 వేల చొప్పున నిధులను అందించనున్నారు. మోరంచపల్లి, మీనాజిపేట, మొగుళ్లపల్లి, ధన్వాడ, కనుకునూర్, గంగారం, సూరారం, నాగారం, దూత్‌పల్లి, రుద్రారం, గొల్లబుద్దారం ఉప కేంద్రాలను కాయకల్ప అవార్డుకు ఎంపిక చేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన మోరంచపల్లి, మీనాజిపేట, మొగుళ్లపల్లి కేంద్రాలకు రూ.లక్ష, రూ.50 వేలు, రూ.35 వేలు అందిస్తుండగా మిగిలిన ఉప కేంద్రాలకు రూ.25 వేల చొప్పున నిధులను అందించనున్నారు. అలాగే చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి కాయకల్ప అవార్డు వరించగా రూ.లక్ష నిధులను మంజూరు చేయనున్నారు.

మూడేళ్ల పాటు నిధులు

ఎన్‌క్వాష్ అవార్డుకు ఎంపికైన మూడు పీహెచ్‌సీలు, ధన్వాడ పల్లె దవాఖానాకు మూడేళ్ల పాటు నిధులను అందించనున్నారు. పల్లె దవాఖానాకు ఏటా రూ.1.26 లక్షలు, పీహెచ్‌సీకి రూ.3 లక్షల చొప్పున నిధులను అందించనున్నారు. వచ్చిన నిధుల్లో 25 శాతం వైద్య సిబ్బందికి ప్రోత్సాహక నగదు అందించనుండగా మిగిలిన 75 శాతం నిధులతో ఆసుపత్రిలో అసరమైన మిషనరీ కొనుగోలు, పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత, వార్డుల్లో ఏసీలు, లేదా కూలర్లు, ఫ్యాన్లు తదితర అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఇదే స్ఫూర్తితో ముందుకు-ధనసరి శ్రీరామ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

జిల్లాలో మూడు పీహెచ్‌సీలు, ఒక పల్లె దవాఖానాకు ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఎన్‌క్వాస్ అవార్డులు వచ్చాయి. వైద్యాధికారులు, సిబ్బంది చేస్తున్న కృషితో అవార్డులు వరిస్తున్నాయి. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లి మరిన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎన్‌క్వాష్ అవార్డులు వచ్చేలా ప్రయత్నం చేస్తున్నాం. వచ్చే సంవత్సరానికి సంబంధించి మొగుళ్లపల్లి, అంబట్‌పల్లి, వెలిశాల పీహెచ్‌సీలకు ఎన్‌క్వాష్ అవార్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

# ఇంటింటా.. ఓటరు సర్వే!

భూపాలపల్లి : ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం లాంటింది. దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి ఒక్క ఓటుకు మాత్రమే ఉంది. ప్రజలు అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకునేందుకు మహత్తర అవకాశం ఇది.. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఓటరు జాబితా పూర్తి పారదర్శకంగా, తప్పులు లేకుండా తయారు చేసేందుకు చర్యలు చేపట్టింది. బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఒకే వ్యక్తికి రెండు ఓట్లు, చనిపోయినవారు, ఇతర ప్రాంతాలకు వెళ్లినవారి వివరాలను పరిశీలిస్తూ అవసరం లేనివాటిని తొలగిస్తున్నారు. అక్టోబరు 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించనున్నారు.

షెడ్యూల్ ఇలా..

ఎన్నికల సంఘం స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్ఎస్ఆర్) 2023 విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మే 25 నుంచి జూన్ 23వ తేదీ వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటరు జాబితాను సరిచూసుకుంటూ అనర్హులైన వారిని తొలగిస్తారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని అవగాహన కల్పిస్తారు. జూన్ 24 నుంచి జులై 24వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అవసరమైన వసతులను పరిశీలించడం, పోలింగ్ కేంద్రాల ఫొటోలు తీసుకొని ఎన్నికల సంఘానికి అందించనున్నారు. జులై 25 నుంచి 31 వరకు అన్ని రకాల దరఖాస్తులను పరిశీలించి ఆగస్టు 1వ తేదీ నాటికి అర్హులైన వారి వివరాలను ఓటరు జాబితాలో చేర్చి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆగస్టు 2న ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించాలి. ఆగస్టు 2 నుంచి 31 వరకు ముసాయిదా జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తారు. నూతన ఓటరు నమోదు, మార్పులు చేర్పులపై ఎన్నికల సంఘం ప్రత్యేక శిబిరాలను నిర్వహించనుంది. అలాగే సెప్టెంబరు 22న అభ్యంతరాలపై వివరణ ఇస్తారు. సెప్టెంబరు 29న ఓటరు తుది జాబితా ప్రదర్శనకు ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవడం, ఓటరు జాబితా ప్రింటింగ్ చేయడం పూర్తి చేస్తారు. అక్టోబరు 4న తుది ఓటరు జాబితా ప్రదర్శిస్తారు.

ఉమ్మడి జిల్లా ఓటర్లు 27.75 లక్షల మంది

జనవరి 5న ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటరు జాబితా ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాల్లో 27.75 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల సంవత్సరం కావడంతో మరోమారు నూతన ఓటరు



నమోదుతో పాటు, అనర్హత ఓట్లను తొలగించడం, పోలింగ్ కేంద్రాల స్థితిగతులను తెలుసుకోవడం, ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించడం, తుది ఓటరు జాబితాను ప్రచురించేలా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. అందులో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటా సర్వే నిర్వహిస్తూ ఓటరు జాబితాను మరోసారి సరిచూస్తూ తప్పుల సవరణ, వలస వెళ్లిన వారిని గుర్తించడం, మరణించిన వారిని తొలగించడం తదితర కార్యక్రమాలను చేస్తున్నారు. ఇందుకు సంబంధిత అధికారులకు ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు పూర్తి చేశారు. అందులో భాగంగా బీఎల్వోలు గత మే 25 నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేపట్టి వివరాలను సంబంధిత ఎన్నికల అధికారులకు అందించే పనిలో ఉన్నారు.

అర్హులైన వారు నమోదు చేసుకోవాలి

– భవేశ్ మిశ్రా, కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇందుకు సంబంధించి బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలి. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపు తదితర వాటిని మళ్లీ పరిశీలన చేపడతాం. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఒక పోలింగ్ కేంద్రంలో 1500 ఓటర్లు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కువ మంది ఓటర్లు ఉంటే పోలింగ్ కేంద్రాలను పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం.

# ఆనవాళ్లు లేని పనులు.. అడ్డగోలుగా బిల్లులు

జనగామ : ఎంబీ రికార్డుల మాయం, ఇష్టారాజ్యంగా ప్రతిపాదిత పనుల మార్పు, నిబంధనలకు విరుద్ధంగా బిల్లుల చెల్లింపు, అత్యవసరాల పేరిట నేరుగా నగదు వినియోగం, ఏళ్ల తరబడి ఆడిట్ లేకుండా నిధులు ఖర్చు చేయడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ జనగామ పురపాలిక తీరు మారడం లేదు. రూ.30 కోట్ల అభివృద్ధి పనుల ప్యాకేజీలో రెండేళ్ల క్రితం వార్డుల్లో చేపట్టిన మౌలిక సదుపాయాల పనులకు ఇటీవల ఎంబీ రికార్డు చేయించి, గుత్తేదారుకు బిల్లుల చెల్లింపునకు జరిగిన వ్యవహారాన్ని మరువక ముందే మరో అక్రమానికి తెర తీశారు. రెండేళ్ల క్రితం జరిగిన పనుల పేరిట తాజాగా సుమారు రూ.3 లక్షల బిల్లు చెల్లించాలనే ప్రతిపాదనపై చర్చ జరుగుతోంది.

అప్పటి పనులకు..జనగామలో 2021లో బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో డోజర్‌తో 129 గుంటలను చదును చేసినందుకు రూ.1,03,200, పలు వార్డుల్లో 350 ట్రిప్పుల మొరం పోసినందుకు రూ.2.45 లక్షలు చెల్లించాలని గతేడాది ఏప్రిల్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశం ఎజెండాలో ప్రతిపాదించారు. పనులు జరిగిన ఆర్నెల్లకే కౌన్సిల్ ఆమోదం కోరడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన సమావేశంలో తిరిగి ఇదే పనికి సంబంధించిన సవరణ ప్రతిపాదన పేరిట మరోసారి ప్రతిపాదన సమర్పించారు. కౌన్సిల్ తీర్మానం చేసినట్లు ప్రస్తావనలో పేర్కొన్నారు.

పలు అనుమానాలకు చోటు

పనులు జరిగిన ఆర్నెల్లకు మొదటి సారి కౌన్సిల్ ఆమోదం కోరారు. రెండేళ్ల తర్వాత అదే పనికి మరోసారి ఆమోదం కోరారు. తొలి సారి రెండు పనులకు ఒకే మొత్తంలో బిల్లు చెల్లించాలని ప్రతిపాదించిన అధికారులు, రెండో సారి ఒకే పనిని ముక్కలుగా విడగొట్టి బిల్లు చెల్లించాలని కోరడం అనుమానాలకు తావిస్తోంది.

ఇంజినీరింగు విభాగం ఆధ్వర్యంలో జరగాల్సిన పనిని పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో జరిగినట్లు ప్రస్తావించారు. 2021లో ఈ పనులు జరిగినట్లు భావించినా, అప్పట్లో ఉన్న కమిషనర్, పారిశుధ్య అధికారి, మున్సిపల్ ఇంజినీరు ఇప్పుడు లేరు. కొటేషన్ ద్వారా పనిని గుత్తేదారుకు అప్పగించారు. పని జరిగితే వెంటనే ఎంబీ రికార్డు చేసి, బిల్లు తయారు చేసి వివిధ అంచెల్లో ఆయా అధికారుల సంతకాలు తీసుకోవాలి. కానీ ఈ రెండు పనులకు ఎంబీ రికార్డులు లేవు. దీంతో మొదటి ప్రతిపాదనకు భిన్నంగా పనులను విడగొట్టారు. రూ.50 వేల లోపు బిల్లుల చెల్లింపునకు ఎంబీ రికార్డులు అవసరం లేదు. ఈ నిబంధనను అడ్డుగా పెట్టుకొని మొరం పోసిన పనులను ఆరు భాగాలుగా విభజించారు. డోజర్‌తో చదును పనిని మూడు ముక్కలుగా విభజించారు. వోచర్ల ద్వారా చెల్లింపునకు ఆక్షేపణలు ఉండవనే ఈ విధానాన్ని అనుసరించినట్లు తెలుస్తోంది.

ఆధారాలేవీ? : బిల్లుల కోసం సమర్పించిన ప్రతిపాదనలో పేర్కొన్న పనుల వివరాలను పరిశీలిస్తే.. సదరు ప్రదేశాల్లో అసలు పనులు జరిగాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రెండో వార్డులోని బతుకమ్మ కుంటలో 51 ట్రిప్పుల మొరం పోసినట్లు పేర్కొన్నారు. దుర్గమ్మ గుడి నుంచి సూర్యాపేట రోడ్డు వరకు బీటీ రహదారి ఉంది. మొరం పోయాల్సిన అవసరం లేదు. పోసిన ఆనవాళ్లు లేవు. 23వ వార్డు పేరిట బీరప్పగడ్డ, ఏబీవీ ఉన్నతపాఠశాల వెనుక పోసినట్లు పేర్కొన్నారు. కానీ ఏబీవీ ఉన్నతపాఠశాల ఆరో వార్డు పరిధిలో ఉంది. డోజర్‌తో చేసిన పనుల వివరాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఏ ప్రాంతాల్లో చదును చేసినట్లు పేర్కొన్నారో, ఆ ప్రాంతాల్లోనే మొరం పోసినట్లు రాసుకున్నారు. గతేడాది ఏప్రిల్‌లో ప్రతిపాదనలో 30 వార్డుల్లో చదును చేసినందుకు బిల్లులు ఇవ్వాలని కోరిన వారు, తాజా ప్రతిపాదనలో ఎంపిక చేసిన వార్డుల సంఖ్యనే నమోదు చేశారు. ః బతుకమ్మ కుంటలో ఓ కౌన్సిలర్ మొరం పోయించగా, ఆయనకు బిల్లు ఇవ్వలేదని, ఆ పనిని అడ్డు పెట్టుకొని ఓ గుత్తేదారు పేరిట డబ్బు దండుకునేందుకు ఈ వ్యవహారానికి తెర తీసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇది పెండింగులో పడినట్లు సమాచారం.

తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

–రజిత, జనగామ మున్సిపల్ కమిషనర్

2021లో దసరా ఉత్సవాల సందర్భంగా చేసిన పనులకు సంబంధించిన బిల్లును గతేడాది కౌన్సిల్ ఆమోదం కోసం ప్రవేశపెట్టింది నిజమే. సాంకేతిక అంశాలను దృష్టిలో ఉంచుకొని సవరణ ప్రతిపాదన చేశారు. కౌన్సిల్ తీర్మానానికి సంబంధించి నోట్‌ఫైల్‌పై ఛైర్‌పర్సన్ సంతకం చేశారు. ఇంకా బిల్లు చెల్లించలేదు. అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకొని తుది నిర్ణయం తీసుకుంటారు.

# సర్కారు వైద్యం.. పేదలకు వరం

హనుమకొండ : రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తోంది. అవసరమైన నిధులు కేటాయించింది. సర్కారు వైద్యశాలలను బలోపేతం చేస్తోంది. సకల సౌకర్యాల కల్పనకు అడుగులు వేస్తోంది. పేదలకు మెరుగైన సేవలు అందించడానికి హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంట్రల్ హబ్ ఏర్పాటు చేసింది. ఇటీవల రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ఆన్‌లైన్ వేదికగా ప్రారంభించారు. రేడియాలజీ విభాగంలో అధునాతన యంత్రాలను ఏర్పాటు చేశారు. టీ-హబ్‌లో రూపాయి ఖర్చు లేకుండా కేవలం ఆధార్ కార్డుతో 57 రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు.

శాంపిల్స్ మొత్తం ఇక్కడకే..

జిల్లాలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నగరంలోని 7 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, పరకాల, కమలాపూర్‌లోని సీహెచ్‌సీ, హనుమకొండలోని ఏరియా ఆసుపత్రిలో రోగుల నుంచి సేకరించిన నమూనాలు(శాంపిల్స్) టీ-హబ్‌కు పంపిస్తారు. శాంపిల్స్ సేకరించడానికి ప్రత్యేకంగా రెండు వాహనాలను సమకూర్చారు. నివేదికల(రిపోర్టుల)ను నేరుగా చరవాణికి పంపిస్తున్నారు. దీర్ఘకాలిక రుగ్మతలు ఉన్న వారిని నేరుగా టీ-హబ్‌లో అధునాతన యంత్రాల ద్వారా పరీక్షిస్తున్నారు.

24 గంటల్లో సందేశం..

టీ-హబ్‌లో డయాబెటిక్స్‌లో 6 రకాలు, థైరాయిడ్ ప్రొఫైల్‌లో 3, కాలేయ పనితీరు పరీక్షల్లో 10, రేనల్ ఫంక్షన్ పరీక్షలు 3, లిపిడ్ ప్రొఫైల్ 8, సీరం ఎలక్ట్రోలైట్స్, ఇతర కలిపి 6, కంప్లీట్ బ్లడ్ పిక్చర్(సీబీపీ) 13, మైక్రోబయాలజీ పరీక్షలు 8, మొత్తం 57 రకాల పరీక్షలు చేస్తారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మరో ఐదు యంత్రాలు సేవలందిస్తున్నాయి. రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన మామోగ్రామ్, అల్ట్రాసౌండ్, ఈసీజీ, డిజిటల్ ఎక్స్‌రే, 2డీ-ఎకో యంత్రాలతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నివేదికలను చరవాణికి పంపిస్తున్నారు. నేరుగా వచ్చే వారికి కవర్‌లో పెట్టి అందజేస్తున్నారు. టీ-హబ్‌లో ఇచ్చే రిపోర్ట్ ఎక్కడైనా చెల్లుబాటు అవుతాయని నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఆఫ్ ల్యాబోరేటరీస్ ధ్రువీకరణ పత్రం ఇచ్చింది.

# స్వచ్ఛత భళా.. ఖజానా గలగల

కొత్తగూడెం : చెత్తను చూడగానే ముఖం తిప్పుకొంటాం.. అదే వ్యర్థం గ్రామపంచాయతీలకు ఆదాయం కురిపిస్తోంది. అటు శుభ్రత పెంచి ఇటు సంపద పంచుతోంది. చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్లకు తరలిస్తున్నారు. అక్కడ తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేసి విక్రయిస్తున్నారు. పంచాయతీలకు అదనపు ఆదాయ వనరుగా మారుతోంది.

ప్రతి పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్డు

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి ఆదాయం సమకూర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేసే కేంద్రాలు(సెగ్రిగేషన్ షెడ్లు) నిర్మించింది. ఉపాధి హామీ పథకంలో ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ. 2.50లక్షలు కేటాయించింది. ఖమ్మం జిల్లాలోని 589 గ్రామపంచాయతీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 481 గ్రామపంచాయతీల్లో షెడ్లు పూర్తయ్యాయి. వీటి వల్ల పరిసరాల పరిశుభ్రతతోపాటు పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు గ్రామాల్లో ప్రతి ఇంటికి రెండు చెత్తడబ్బాలు ఇచ్చారు. ఈ మేరకు ప్రజలను అధికారులు, ప్రజాప్రతినిధులు చైతన్యపరిచారు. నిత్యం గ్రామాల్లో ఇళ్ల నుంచి ట్రాక్టర్ ద్వారా సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలిస్తున్నారు.

చెత్తను వేరుచేసి ఎరువుల తయారీ

సేకరించిన తడి చెత్తనుంచి వర్మీ కంపోస్టును తయారుచేస్తున్నారు.



ఇందుకు 60 రోజులు అవసరం. ఈ సేంద్రియ ఎరువును హరితహారంలో నాటిన మొక్కలకు, ఎవెన్యూ ప్లాంటేషన్‌కు వినియోగిస్తున్నారు. మిగిలిన ఎరువును రైతులకు విక్రయిస్తున్నారు. 14 కిలోల ఎరువు సంచికి రూ. 250గా నిర్ణయించారు. పొడిచెత్తలోని ప్లాస్టిక్ సీసాలు, గాజు, ఇనుము, రబ్బరు వంటి వస్తువులను షెడ్‌లోని మరో అరలో వేస్తున్నారు. అనంతరం సేంద్రియ ఎరువుతోపాటు పొడిచెత్తను సైతం విక్రయిస్తున్నారు. తద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం వస్తోంది. ఇళ్ల నుంచి తడి, పొడిచెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్లుకు తరలించి అక్కడ ఎరువు తయారు చేయడం ద్వారా గ్రామాల్లో రహదారుల వెంట చెత్త, చెదారం కనిపించడం లేదు. పల్లెలు పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి.

పల్లెలకు ఆదాయం

లక్కినేని రమాకాంత్, భద్రాద్రి జిల్లా పంచాయతీ అధికారి

ప్రతి పంచాయతీలో తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చేలా చర్యలు తీసుకున్నాం. ఆ ఎరువును హరితహారం మొక్కలకు వినియోగించి మిగిలిన మొత్తం విక్రయిస్తున్నారు. ఇలా ఎరువు, పొడిచెత్తను విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించడం ద్వారా గ్రామాలు స్వచ్ఛంగా, పరిశుభ్రంగా మారుతున్నాయి.


# సింగరేణితో సిరిసంపదలు: కలెక్టర్

సత్తుపల్లి : ప్రజల అభ్యున్నతికి దోహదపడుతున్న సింగరేణిని ప్రోత్సహించాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సత్తుపల్లిలో సింగరేణి ఏరియా జీఎం జక్కం రమేశ్ ఆధ్వర్యంలో సింగరేణి సంబురాలను నిర్వహించారు. కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే సండ్రతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ సింగరేణి వల్లే ఉభయ జిల్లాల్లో పరిశ్రమలు ఏర్పాటయ్యాయన్నారు. జేవీఆర్, కిష్టారం ఓసీలు రావడంతో సత్తుపల్లి అభివృద్ధి చెందుతోందని చెప్పారు. యావత్ సింగరేణిలో అతిపెద్ద మైనింగ్ ఇండస్ట్రీ సత్తుపల్లిలో ఉండటంతో అదృష్టమన్నారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ రూ. 183కోట్లతో ఈ ప్రాంతంలో 445 పనులు చేశామని, మరో రూ. 33కోట్లు సీఎస్ఆర్ నిధులను అభివృద్ధికి ఉపయోగించామని తెలిపారు. బాంబు పేలుళ్ల కారణంగా దెబ్బతిన్న ఇళ్లను సర్వే చేయడానికి త్రిసభ్య కమిటీని నియమించామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణతోపాటు పర్యావరణ హితం కోసం సీహెచ్‌పీ, రైల్వే లైనును సింగరేణి ఏర్పాటు చేసిందని, ఈ రైల్వే లైనును ప్రజావసరాల మేర కొవ్వూరుకు భవిష్యత్తులో ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తు కలిగిన సింగరేణిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సత్తుపల్లి అభివృద్ధికి సింగరేణి సంస్థ రూ. 100కోట్లు కేటాయించడం గొప్ప విషయమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కార్మికులకు ఇంక్రిమెంట్లు, బోనస్‌లు, వేతనంతో కూడిన సెలవులు, కారుణ్య నియామకాలు ఇచ్చిందని కొనియాడారు. పలువురికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. పుర ఛైర్మన్ కూసంపూడి మహేశ్, ఆత్మ ఛైర్మన్ వనమా వాసు, కమిషనర్ సుజాత, ఎంపీపీ దొడ్డా హైమావతి, జడ్పీటీసీ సభ్యుడు కూసంపూడి రామారావు, ఆర్డీవో సూర్యనారాయణ, ఏసీపీ రామానుజం, డీఆర్‌డీవో విద్యాచందన, ఎంపీడీవో సుభాషిణి, పీవోలు వెంకటాచారి, నరసింహారావు, గుర్తింపు సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్ పాల్గొన్నారు.

9న పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ..

సంక్షేమ దినోత్సవం సందర్భంగా అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నివాస స్థలాల పట్టాల పంపిణీకి జిల్లాలో 58 ఎకరాలను గుర్తించామన్నారు. ఇళ్ల స్థలాల కోసం 4,526 దరఖాస్తులు అందాయని తెలిపారు. అదనపు కలెక్టర్ మధుసూదన్, శిక్షణ కలెక్టర్లు రాధిక గుప్తా, మయాంక్ సింగ్, కల్లూరు ఆర్డీవో సూర్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సత్యనారాయణ, డీటీలు రాంబాబు, రంజిత్ పాల్గొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామస్థాయిలో చెరువుల పండుగను గురువారం నిర్వహించాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో సమీక్ష జరిపారు. జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్ పాల్గొన్నారు. ఖమ్మంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాలులో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఎ. సురేందర్, ట్రాన్స్‌కో ఎస్ఈ ఈ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ విద్యుత్తు విజయోత్సవాలను ప్రారంభించారు.

# గడువు పెంచినా స్పందన అంతంతే..!



కొత్తగూడెం : ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నవారు తమ గృహాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకోసం ఉత్తర్వులు- 58, 59 విడుదల చేసింది. రెండు దఫాలుగా క్రమబద్ధీకరణకు ఆస్కారమిచ్చినా ప్రజలను చైతన్యపరచటంలో అధికారులు విఫలమయ్యారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తర్వు- 58 కింద 125 చదరపు గజాల లోపు స్థలాన్ని అధికారులు ఉచితంగా క్రమబద్ధీకరిస్తున్నారు. 125 చదరపు గజాల విస్తీర్ణం దాటిన స్థలం క్రమబద్ధీకరణకు మార్కెట్ ధర చెల్లించాలని ఉత్తర్వు- 59 స్పష్టం చేస్తోంది. పట్టణాల్లో గత ప్రభుత్వాలు పట్టాలు ఇచ్చినా మళ్లీ కొందరు దరఖాస్తు చేసుకున్నారు. నిరక్షరాస్యులను లక్ష్యంగా చేసుకుని మీసేవ కేంద్రాల వద్ద దళారులు చేతివాటం ప్రదర్శించారు.

గతేడాది అక్టోబర్‌లో మొదటిసారి క్రమబద్ధీకరణ ఉత్తర్వులు- 58, 59ను రాష్ట్ర ప్రభుత్వం వెలువరించింది. దరఖాస్తు చేసుకునేందుకు మూడునెలలు గడువు విధించింది. 2014 జూన్ 2 ముందువరకు ఆక్రమిత స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి అవకాశం కల్పించింది. ఈ ఉత్తర్వులపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించినా అధికారులు పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఉత్తర్వు-58 కింద 410, ఉత్తర్వు- 59 కింద 3,335 దరఖాస్తులు వచ్చాయి. మార్కెట్ ధర గజం రూ. 3వేల కంటే తక్కువ ఉన్న దరఖాస్తులను అధికారులు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మార్కెట్ విలువ ఎక్కువున్న (గజం రూ. 3,500 ఆపైన) దరఖాస్తుల పరిశీలనపై ప్రభుత్వం నుంచి విధివిధానాలు రాలేదు. ఫలితంగా 214 దరఖాస్తులను అధికారులు పరిశీలించలేదు.

రెండో విడతలో..

ప్రజల్లో అవగాహన లేకపోవడంతో అర్హులైనవారు ఈపథకానికి దూరమయ్యారు. గడువును పెంచాలని ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు సర్కారు స్పందించింది. 2020 జూన్ 2 వరకు ఆక్రమిత గడువును పొడిగించి రెండోసారి క్రమబద్ధీకరణ దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించింది. ఈ గడువు మే 31తో ముగిసింది. ఉభయ జిల్లాల్లో ఉత్తర్వులు- 58, 59 కింద 6,125 దరఖాస్తులు అందాయి. దరఖాస్తు చేసుకున్నవారిలో ఎక్కువమంది ఇప్పటికే ప్రభుత్వం నుంచి పట్టాలు పొంది ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. తాజాగా స్వీకరించిన దరఖాస్తులపై ఎప్పుడు సర్వే చేపడతారో? ప్రభుత్వానికి చెల్లించాల్సిన క్రమబద్ధీకరణ రుసుము విధింపు, డిమాండ్ నోటీసుల పంపిణీ వంటివి చేపట్టేందుకు రెండు నెలలు పట్టొచ్చు.

ప్రచార లోపమే కారణమా..?

ఉభయ జిల్లాల్లోని ప్రధాన పట్టణాల్లో ఆయా పథకాల పేరిట ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాలున్నాయి. కమ్యూనిస్టుల ఆందోళనలతో వేలాది మంది పేదలు గుడిసెలు ఏర్పాటుచేసుకున్నారు. వీటితో పాటు కొందరు దశాబ్దాలుగా నివాసముంటున్న స్థలాలున్నాయి. వాస్తవంగా ఈ నివాసాలన్నీ క్రమబద్ధీకరణకు అర్హమైనవే. 58, 59 జీఓల లక్ష్యం, ప్రయోజనాలను ప్రజలకు వివరించటంలో అధికారులు అలసత్వం వహించారనే వాదనలు వినిపిస్తున్నాయి. దినపత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని దరఖాస్తు చేసుకున్న వారే ఎక్కువ మంది ఉన్నారు. ఆటో ప్రచారం, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ఫ్లెక్సీల ఏర్పాటు తదితర చర్యలతో దరఖాస్తుల సంఖ్య పదింతలయ్యే అవకాశం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సరకులిస్తా.. వంట చేస్తే చాలు!



కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద పిల్లలు మధ్యాహ్నం పస్తులుండకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 'భోజన పథకం' అమలు చేస్తున్న విషయం తెలిసిందే. నిర్వహణలో వివిధ సమస్యలు ఉత్పన్నమవుతుండటంతో ఈ ఏడాది నుంచి సంస్కరణలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ప్రస్తుతం గురుకులాలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలకు టెండరు దక్కించుకున్న గుత్తేదారు ద్వారా నేరుగా సరకులు సరఫరా చేస్తున్నారు. రూ.వేలల్లో వేతనం అందుకుంటున్న వంట సిబ్బంది భోజనాన్ని వండిపెడుతున్నారు. సరకుల సరఫరాలో ఇదే విధానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ అమలుచేస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వు వెలువరించారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి కొత్త మెనూ అమలు చేయడంతో పాటు.. టెండరు దక్కించుకున్న గుత్తేదారు సరకులను సరఫరా చేయనున్నట్లు ఉత్తర్వులో ప్రస్తావించారు. ఇందుకోసం ఉభయ జిల్లాల విద్యా శాఖ అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. ఎన్నో అవరోధాలు మధ్యాహ్న భోజన కార్మికులకు నెలవారీ ఇచ్చే గౌరవ వేతనం రూ. 1,000. వారు ఇతర పనులకు వెళ్లకుండా కేవలం నామమాత్ర వేతనంతో పనిచేసే అవకాశాలు లేవు. ఇటీవల సీఎం కేసీఆర్ హామీతో గౌరవ వేతనాన్ని రూ. 3 వేలకు పెంచారు. కానీ ఆ మొత్తం ఇంకా అందడం లేదు. గురుకులాలు, కేజీబీవీల్లో వంట నిర్వాహకులకు వేతనాలు రూ.వేలల్లో లభిస్తున్నాయి.

ఆయా విద్యాలయాలకు సరకులిచ్చే గుత్తేదారులకు బిల్లుల చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయి. కానీ ప్రభుత్వ విద్యాలయాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. వంట ఏజెన్సీలు తామే సరకులు కొనుగోలు చేసి తేవడం ద్వారా ఎంతోకొంత గిట్టుబాటు అవుతోంది. రూ. 1,000 గౌరవ వేతనంతో సర్దుకుపోతున్నారు. ఇకపై గుత్తేదారు కావాల్సిన నిత్యావసరాలు, కూరగాయలు సరఫరా చేస్తే వేతనాన్ని గురుకులాల సిబ్బంది స్థాయిలో ఇస్తారా? అనే ప్రశ్న తలెత్తుతోంది. కొత్త విధానం అమలు విషయం చూస్తే.. కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 10 నుంచి 20 మధ్య ఉంటుంది. అవి కూడా మారుమూల ప్రాంతాల్లో కొనసాగుతుంటాయి. అలాంటి పాఠశాలలకు గుత్తేదారుల ద్వారా మధ్యాహ్న భోజనానికి సరకుల పంపిణీ ఆచరణ సాధ్యమేనా? అనే సందేహం విద్యాశాఖ అధికారుల్లో తలెత్తుతోంది. ముమ్మందు ఎదురయ్యే ఇబ్బందులను ఎలా పరిష్కరిస్తారో వేచిచూడాల్సిందే.

మధ్యాహ్న భోజన పథకం సరకులు, కూరగాయలను వంట ఏజెన్సీతో సంబంధం లేకుండా గుత్తేదారు ద్వారా సరఫరా చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు వెలువరించింది. ఇన్నిరోజులు వంట కార్మికులు బిల్లులు రాక నానా అవస్థలు పడ్డారు. ఇకపై సరకులు పాఠశాలలకు చేరేలా సంబంధిత గుత్తేదారుడు బాధ్యత తీసుకోవాలి. ఉన్నతాధికారుల ఆదేశాల అమలుకు చర్యలు తీసుకోనున్నాం.

సోమశేఖర్‌శర్మ, డీఈఓ

# పత్తి రైతులకు ప్రోత్సాహకం అందేనా?

జనగామ : ఏటా పత్తి రైతులకు నష్టాలు తప్పడం లేదు. పంట దిగుబడి లేదా ధర.. రైతులను నిలువునా ముంచుతున్నాయి. అలాగని పత్తి సాగు చేయడం మానుకోవడం లేదు. దిగుబడి వచ్చినప్పుడు మంచి ధర లేకపోవడంతో రైతు పరిస్థితిలో మార్పు ఉండడం లేదు. ఈ నేపథ్యంలో సాలు పద్ధతిలో పత్తి సాగుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయాలని అందుకు తగిన విత్తనాలను ఎంచుకోవాలని, నిపుణులు చెప్పిన పద్ధతిలో విత్తితే అనేక తెగుళ్లను తట్టుకొని ఆశించిన దిగుబడి వస్తుందని అన్నదాతలకు వివరించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో అధికారులకు అవగాహన కల్పించిన ప్రభుత్వం జిల్లాల్లో రైతుల ఆసక్తి మేరకు క్లస్టర్లను ఎంపిక చేసింది. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసిన రైతులకు రూ. 4 వేల ప్రోత్సాహకం అందజేస్తామని ప్రభుత్వం ఊరించింది. సాగు చేసిన పత్తి పంట చేతి కందింది. ధర లేక అన్నదాతలు చేతులు కాల్చుకున్నా ఇంత వరకు ప్రోత్సాహకం అందలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 612 మంది రైతులు 1,056 ఎకరాల్లో ఈ పద్ధతిలో పత్తి సాగు చేశారు. డిసెంబర్‌లోగా పంట చేతికొస్తుందని, యాసంగిలో మరో పంట వేసుకోవచ్చని అధికారులు వారికి వివరించారు.

అధికారులు చెప్పినట్టే..సాధారణ పద్ధతిలో పత్తి విత్తనాలు వేసే క్రమంలో ఎకరాకు 6,500 నుంచి 7,000 వరకు మొక్కలు ఉంటున్నాయి. సరికొత్త విధానం ద్వారా ఎకరాకు 25,000 మొక్కలు ఉండేలా విత్తారు. ఈ పద్ధతిలో సాలు సాలుకు మధ్య 90 సెం.మి. దూరం, ప్రతి రెండు మొక్కల మధ్య 20 సెం.మి. దూరం ఉండేలా జాగ్రత్త పడ్డారు. గతంలో రెండు సంచుల విత్తనాలు అవసరమైతే కొత్త విధానంలో ఏకంగా ఐదు సంచుల విత్తనాలు అవసరమయ్యాయని రైతులు చెప్పారు. ఈ మేరకు అధికారుల పర్యవేక్షణలో పంట సాగు చేసిన రైతులు మరుసటి రోజు నుంచే ప్రోత్సాహకం కోసం ఎదురు చూస్తున్నారు.

కొత్త పద్ధతిలో పంట సాగు చేసిన రైతుల వివరాలను వ్యవసాయ విస్తరణాధికారులు ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేసిన తర్వాత డీబీటీ పద్ధతిలో ప్రభుత్వం రూ. 4 వేల ప్రోత్సాహకాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పిందని రవీందర్‌రెడ్డి అనే రైతు చెప్పారు.

# గణగణ గంట.. సిద్ధమవ్వాలంట!

వరంగల్ : మరో వారం రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సెలవుల్లో అనేక వ్యాపకాలతో ఉన్న పిల్లలు బడి గంట మోగగానే వెళ్లడానికి కాస్త బెరుకుగానే ఉంటారు. దీన్ని 'స్కూల్ ఫోబియా' అంటారు. దీన్నుంచి వారిని బయట పడేయాలంటే తల్లిదండ్రులు ఇప్పటి నుంచే మానసికంగా, శారీరకంగా సిద్ధం చేయాలి. పిల్లలు సంతోషంగా బడికి వెళ్లాలంటే ముందస్తు సంసిద్ధత అవసరం అంటున్నారు నిపుణులు.

ఈ ఉదాహరణ చూడండి..

జనగామ జిల్లా పాలకుర్తికి చెందిన సోమయ్యకు ఇద్దరు కొడుకులు 7, 8వ తరగతి చదువుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు, నోటుపుస్తకాలకే రూ. 8 వేలు ఖర్చు చేశారు. వీటితోపాటు ఇతర ఖర్చులు (బూట్లు, లంచ్‌బాక్సు, పెన్నులు, ఇతరాత్ర వస్తువులు) మరో రూ. 2 వేలు, పాఠశాల మొదటి విడత ఫీజు రూ. 10 వేలు(ఇద్దరికి) కి చెల్లించారు. యూనిఫాంకు మరో రూ. 6 వేల వరకు ఖర్చు చేశానని వివరించారు. పిల్లల చదువులకే ఇప్పటివరకు ఈ నెలలో రూ. 26 వేల వరకు ఖర్చవుతున్నాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులకు ఆర్థిక ప్రణాళిక ఎంతో అవసరం.

సెలవుల్లో ..

తల్లిదండ్రులు కాస్త గారాబం ఎక్కువ చేస్తారు. పిల్లలు పొద్దెక్కే వరకు పడుకున్నా ఏమీ అనరు.

పుస్తకాలు చదవడానికి బదులు, చరవాణులపై ఎక్కువ సమయం గడిపి ఉంటారు.

ఆహార సమతుల్యత దెబ్బతిని ఉంటుంది. పిండి వంటలు, మిఠాయిలు, బయటి చిరుతిళ్లు ఎక్కువగా తింటుంటారు. ఇంట్లోనూ రకరకాల వంటలు వండి పెడుతుంటారు.

జీవన శైలిలో సైతం పిల్లల్లో అనేక మార్పులు కనిపిస్తాయి. విహార యాత్రలకు వెళ్లడం, అమ్మమ్మ, బంధువుల ఇంటికి వెళ్లడం లాంటివి సెలవుల్లో పరిపాటి.

ఇకపై ఇలా

బడికెళ్లేటప్పుడు ఉదయం ఎన్ని గంటలకు నిద్ర లేచేవారో ఇప్పుడూ అదే సమయానికి మేల్కొనేలా చూడాలి.



స్క్రీన్ టైం తగ్గించాలి. ఇప్పటి వరకు రోజుకు రెండు మూడు గంటలు చూస్తే.. వచ్చే వారం పది రోజులు రోజుకు అరగంట మించకుండా పెద్దలు జాగ్రత్త పడాలి. కథల పుస్తకాలు, జీవిత చరిత్ర, వ్యక్తిత్వ వికాస తరగతి పుస్తకాలు రోజుకు కనీసం అయిదారు పేజీలైనా చదివేలా చూడాలి.

బడికెళ్లేటప్పుడు ఉదయం అల్పాహారం, మధ్యలో స్నాక్స్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం వేళకు భోజనం క్రమశిక్షణగా చేసినట్టే ఇప్పుడూ అలవాటు చేయాలి. చిరుతిళ్లను మాన్పించాలి. పాఠశాలల్లో భోజన సమయాలను తెలుసుకుని ఇప్పటి నుంచే ఆ విధంగా అందించాలి.

సెలవులకు వెళ్లిన వారిని కనీసం వారం ముందే ఇంటికి తీసుకు రావడం శ్రేయస్కరం. లేదంటే మర్నాడు స్కూలు ఉందనగా, ఈ రోజు తీసుకొస్తే ఫోబియాతో పిల్లలు మొదట ఒకటి రెండు రోజులు బడి మానేసే ప్రమాదం లేకపోలేదు.

ఇంట్లో బడి వాతావరణం అలవాటు చేస్తున్నాం – వినుతరావు, హనుమకొండ

మాకు ఇద్దరు అమ్మాయిలు. పెద్దమ్మాయి వినీతారావు 8వ తరగతిలోకి, చిన్న కూతురు విజితరావు 6వ తరగతిలోకి వెళ్లనున్నారు. సెలవుల తర్వాత పిల్లలకు బడి భయం సహజంగా ఉంటుంది. మా పిల్లల్లో ఇది లేకుండా సిద్ధం చేస్తున్నా. ఉదయాన్నే నిద్రలేచి వారిని బయట పార్కులకు తీసుకెళుతున్నా. ఇంట్లో హోం స్కూలింగ్ తరగతులు కూడా నిర్వహిస్తున్నాం. ఉదయం నిద్రలేవాలని బలవంత పెట్టేకన్నా, ఉదయం వేళ ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంటుందని, సూర్యోదయం సమయంలో బయటికెళితే కొత్త ఉత్సాహం వస్తుందని చెబితే పిల్లలు నాతోపాటు నడకకు వస్తున్నారు. బద్ధకం పోగొట్టి ఏదో ఒక వ్యాపకంలో పెడితే వారు పాఠశాలకు అంతే ఉత్సాహంగా వెళతారు.

బడిబాటతో ప్రభుత్వం

ప్రభుత్వం ఇప్పటికే 'బడిబాట' కార్యక్రమం చేపట్టింది. పాఠశాలల ప్రారంభానికి వారం ముందు నుంచే ఉపాధ్యాయులు ఊరూరా, వీధివీధికి వెళ్లి బడిబాట నిర్వహిస్తూ పిల్లలకు చదువు వల్ల కలిగే ప్రయోజనాలు చెబుతున్నారు. బడికి ఇది ముందుగా సిద్ధం చేసే కార్యక్రమం.

ఆర్థిక ప్రణాళిక అవసరం

సెలవులు ముగుస్తున్నాయంటే పిల్లలను సిద్ధం చేయడమే కాదు.. ప్రయివేటు పాఠశాలల్లో తమ పిల్లల్ని చదివించే తల్లిదండ్రులు ఆర్థికంగా సిద్ధం కావాలి. ఫీజులు చెల్లించడం, పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్ల కొనుగోలుకు రూ.వేలల్లో వెచ్చించాలి. ఇందుకు తగిన విధమైన ఆర్థిక ప్రణాళిక అవసరం. నెల జీతంలో పిల్లల కోసం కొంత పక్కకు పెట్టాలి.

మంచి పరిసరాలు ఉండాలి..– వనపాకల దిలీప్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, టీపీటీఎఫ్ ఉపాధ్యక్షుడు, ములుగు జిల్లా

ఇటీవల మా స్నేహితుడు రమేశ్ స్వీడన్ నుంచి పిల్లలతో వచ్చారు. అక్కడి విద్యా విధానం చాలా బాగుందని వారి పిల్లల్ని చూశాక తెలిసింది. అక్కడ విద్యార్థులు ఇదే నేర్చుకోవాలనే నిబంధన ఉండదు. పిల్లలకు ఇష్టమైనది టీచర్లు నేర్పిస్తారు. మన పాఠశాలలకు పిల్లలు ఇష్టంగా రావాలంటే మొదట వారికి మంచి పరిసరాలు కనిపించాలి. కొన్ని పాఠశాలల్లో మన ఊరు మన బడి కింద వసతులు కల్పించారు. అన్ని బడుల్లో సకల సౌకర్యాలు కల్పించాలి. అప్పుడే విద్యార్థులు బెరుకు లేకుండా ఇష్టంగా వస్తారు.

ఆసక్తి కలిగించేలా మాట్లాడాలి– డాక్టర్ మాగంటి శేషుమాధవ్, పిల్లల వైద్యుడు, హనుమకొండ

ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బడికి వెళ్లడానికి భయపడుతుంటారు. వారం ముందు నుంచే వారిలో ఆసక్తి కలిగేలా పాఠశాల గురించి, పుస్తకాలు, స్నేహితుల గురించి తల్లిదండ్రులు మాట్లాడాలి. అలా క్రమంగా వారిలో బెరుకు పోగొట్టాలి. బడికెళ్లిన వెంటనే పాఠాలు బోధించకుండా మొదట వారం పాటు ఉపాధ్యాయులు వారితో మమేకం కావాలి.

# కు.ని.కి పాట్లు

ఆదిలాబాద్ : జిల్లా వైద్యారోగ్య శాఖను అసౌకర్యాల కొరత పట్టిపీడిస్తోంది. అసలే సరిపడా వైద్యులు లేరంటే ఉన్న వాళ్ల పనితీరు అనుమానాలకు తావిస్తోంది. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల్లో నిర్లక్ష్యం కొనసాగుతోంది. జిల్లాస్థాయిలో 2016-17లో మినహాయిస్తే ఇప్పటిదాకా ఏ సంవత్సరంలోనూ నిర్దేశించిన లక్ష్యాన్ని వైద్య శాఖ పూర్తి చేయలేదు. మారుమూల ప్రాంతాలు, ప్రధానంగా 24 గంటలపాటు పని చేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ)ల్లో కనీస వసతుల్లేక కు.ని.శిబిరాలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ఆదిలాబాద్‌లోని రిమ్స్ వైద్య కళాశాలకు తరలిస్తే తప్ప చికిత్సలు చేసే పరిస్థితి లేదు.

జిల్లాలో రెండేళ్లుగా కు.ని. శస్త్రచికిత్సల నిర్వహణ గాడితప్పింది. కుటుంబ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా గత నెల 27 నుంచి ఈ నెల 24 వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. జనాభా నియంత్రణ కోసం శాశ్వత, తాత్కాలిక అంశాలను ప్రచారం చేయడమే కాకుండా కు.ని. శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంది. జిల్లాలో 27 పీహెచ్‌సీల పరిధిలో 52 మంది వైద్యులకు 38 మంది ఉంటే మరో 14 పోస్టులు ఏళ్లుగా భర్తీ కావడం లేదు. కొంతమంది వైద్యులు కు.ని. శస్త్ర చికిత్సలంటే



ఆసక్తి చూపడం లేదు. కు.ని. కార్యక్రమాల అధికారిగా ఉన్న డా.విజయసారథి చూపిస్తున్న ఆసక్తికి మిగిలిన వైద్యుల సహకారం లభించడం లేదనే విమర్శ వినిపిస్తోంది. ఈ ఏడాది 4 వేల కు.ని. శస్త్ర చికిత్సలు చేయాలనే లక్ష్యానికి ఇప్పటిదాకా కేవలం 2,251మాత్రమే చేశారంటే వాటికి వైద్యశాఖ ఇస్తున్న ప్రాధాన్యం ఏమిటో వెల్లడవుతోంది.

అన్నింటికి రిమ్స్‌కే..

గీ కు.ని.చికిత్సల్లో శాశ్వత పద్ధతిలో మహిళలకు ట్యూబెక్టమీ, పురుషులకు వేసెక్టమీ చేయాల్సి ఉంటుంది. జిల్లాలో 12 రౌండ్ ది క్లాక్ పీహెచ్‌సీల్లో కనీస వసతుల్లేక కు.ని. చికిత్సలంటే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించాల్సి రావడమే ప్రతిబంధకంగా మారుతోంది. ఫలితంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.వేలకు వేలు వెచ్చించాల్సి చేసుకోవాల్సి వస్తోంది. నార్నూర్, ఇంద్రవెల్లి, బోథ్, సిరికొండలాంటి ప్రాంతాల నుంచి వచ్చే నిరుపేదలు దూరభారంతోపాటు ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తోంది. ఈ విషయమై కు.ని. కార్యక్రమాల జిల్లా అధికారి డా.విజయసారథిని సంప్రదించగా కరోనా కారణంగా కొంత ఇబ్బందులు తలెత్తాయనీ, త్వరలో అన్ని ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు.

నమూనా పీహెచ్‌సీ పరిస్థితి ఇది..

భీంపూర్ పీహెచ్‌సీకి నాణ్యత ప్రమాణాలు పాటించే ఆసుపత్రిగా గుర్తింపు ఉంది. పైగా ఇది రౌండ్ ది క్లాక్ (24గంటల)పీహెచ్‌సీ. కానీ ఇక్కడ ఇద్దరు వైద్యులకు ఒక్కరే ఉన్నారు. నలుగురు స్టాఫ్ నర్సులకు ఇద్దరు, 12 మంది ఏఎన్‌ఎంలకు ఆరుగురే ఉన్నారు. కరంజీ, అర్లి(టి), ధనోర, అందర్‌బంద్ సబ్‌సెంటర్లతో ఉన్నా కు.ని. చికిత్సలు చేసే పరిస్థితి లేదు. దీంతో పాటు జిల్లాలోని మరో రౌండ్ ది క్లాక్ పీహెచ్‌సీలు తలమడుగు, బేల, నేరడిగొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, నార్నూర్, దంతన్‌పల్లి, ఇంద్రవెల్లి, గాదిగూడ, ఝరి పీహెచ్‌సీల్లో అదే పరిస్థితి. కనీస వసతుల కల్పనలేక అవరోధం ఏర్పడుతోంది.

# అంగన్‌వాడీ సేవలకు సాంకేతిక దన్ను

ఖమ్మం : మహిళా శిశుసంక్షేమ శాఖలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సాంకేతికత వెన్నుదన్నుగా నిలుస్తోంది. సేవల్లో పారదర్శకతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం పోషణ్ ట్రాకర్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు రిజిష్టర్లలో నమోదు చేసిన ప్రతి అంశాన్ని యావ్‌లో పొందుపరిచేలా దీనిని రూపొందించారు. లబ్ధిదారులకు అందించే సేవలను ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించేలా అన్ని స్థాయిల్లో డాష్‌బోర్డులకు అనుసంధానించారు. యాప్‌ను పటిష్టంగా అమలు చేసేందుకు జిల్లా అధికారయంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టింది. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లకు తర్ఫీదునిచ్చి పోషణ్ అభియాన్ విభాగం ద్వారా పర్యవేక్షిస్తుంది. తద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు లబ్ధిదారులకు పక్కాగా పథకాలు అందేలా ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం గతంలో టీచర్లకు అందించిన చరవాణిల్లో యాప్‌ను వినియోగించే విధానాన్ని కొనసాగిస్తుంది.

అన్ని వివరాలు యాప్‌లోనే నిక్షిప్తంపోషణ్ ట్రాకర్‌లో లబ్ధిదారుల వివరాలు, గృహ సందర్శన షెడ్యూల్, రోజువారీ పర్యవేక్షణ విభాగాలు ఉంటాయి. తద్వారా పనిదినాల్లో ప్రతిరోజు అంగన్‌వాడీ టీచరు కేంద్రానికి హాజరైన విషయాన్ని తెలియచేయాలి. పిల్లల హాజరును నమోదు చేయాలి. ఆహారాన్ని ఎంతమందికి పంపిణీ చేశారో పొందుపరచాలి. ప్రీస్కూల్, పర్సనల్ హైజిన్ యాక్టివిటీని ఆన్‌లైన్ చేయాలి. ప్రతినెలా పిల్లల, గర్భిణుల ఎదుగుదల పర్యవేక్షిస్తూ ఎత్తు, బరువును నమోదు చేయాలి. వ్యాక్సినేషన్ వివరాలను అప్‌లోడ్ చేయాలి.

పోషణ్ ట్రాకర్ కీలకం

అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల నమోదు నుంచి పోషకాహార పంపిణీ, ప్రీస్కూల్ కార్యక్రమాల అమలు, ఆరోగ్య సేవలు అందించే విధానంలో ట్రాకర్ కీలకంగా మారింది. ఇప్పటివరకు కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారుల లెక్కలు ఇష్టానుసారంగా ఉండేవి. ఇకపై ఒక్కో కేంద్రంలో ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారు? పోషకాహారం ఎంత మంది తీసుకుంటున్నారు? నిర్దేశిత సమయానికి అందిస్తున్నారా? గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య స్థితిగతులు ఎలా ఉన్నాయనే అంశాలపై ఉహాజనితమైన లెక్కలకు తావులేకుండా చూడాలని యోచిస్తున్నారు. తాజాగా లబ్ధిదారుల ఆధార్‌కార్డులను అప్‌లోడ్ చేసే ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిలో డాష్‌బోర్డు ద్వారా నిరంతరం అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును పర్యవేక్షించేందుకు పోషణ్ ట్రాకర్ ఉపయోగపడు తుంది. టీచర్లు కూడా సులువుగా విధులు నిర్వహించేందుకు దోహదపడుతుంది. సిబ్బంది పనితీరు ఆధారంగా ఇన్సెంటివ్స్ కూడా ప్రభుత్వం అందిస్తుంది. -సీహెచ్ సంధ్యారాణి, డీడబ్ల్యూవో

# జాతీయ రహదారికి రూ. 700 కోట్లు



ఆదిలాబాద్ : జిల్లాలో మరో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి చకచకా అడుగులు పడుతున్నాయి. జైనథ్ మండలం భోరజ్ నుంచి మహారాష్ట్ర సరిహద్దున బేల మండలం శంకర్‌గూడ వరకు ఉన్న రెండు వరుసల జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా మార్చేందుకు రూ.700 కోట్లు కేటాయించారు. హరితహారం కింద రహదారికి రెండు పక్కల మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతు ండటంతో ఆ పనులు ఆపాలని జాతీయ రహదారి అధికారులు తాజాగా పాలనాధికారికి లేఖ రాశారు.

ఇప్పటికే జిల్లాలో నాలుగు వరుసల దారి నిర్మాణం కోసం సర్వే మొదలైంది. జైనథ్ మండలం భోరజ్ నుంచి మొదలై తర్నం, నిరాల, జైనథ్, దీపాయిగూడ మలుపు, కాప్రి మలుపు, బెల్గాం, బేల మండలం సిర్సన్న, బేల, కొబ్బాయి, శంకర్‌గూడ వరకు మొత్తం 33 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ శాఖ రహదారిని 2017లోనే జాతీయ రహదారిగా ఆమోదించారు. మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే ఈ జాతీయ రహదారిని నెం.353బిగా పిలుస్తున్నారు. దీన్ని నాలుగు వరుసలకు విస్తరించాలని నిర్ణయించారు.

కొనసాగుతున్న సర్వే

దారిలో ఎక్కడెక్కడ వంతెనలున్నాయి, కొత్త వంతెనలు ఎక్కడ నిర్మించాలి, భూసేకరణ ఏమేరకు అవసరం అనే దానిపై సర్వే కోసం ఓఎంఎస్ అనే ప్రైవేటు కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించారు. డ్రోన్ కెమెరాలు, క్షేత్రస్థాయిలో ఒకసారి సర్వే పూర్తి చేసిన ఈ ఏజెన్సీ మరోమారు సర్వే చేస్తోంది. పూర్తయిన సర్వే వివరాలను దిల్లీలోని రోడ్డు, రవాణా శాఖ(మినిస్టీరీ ఆఫ్ రోడ్, ట్రాన్స్‌పోర్ట్) కార్యాలయానికి నివేదించారు. అక్కడి నుంచి అనుమతులు వచ్చాక డీపీఆర్ నివేదిక తయారుచేస్తారు. అనంతరం దిల్లీలోని స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ(ఎస్ఎఫ్‌సీ) ఈ డీపీఆర్ ఆమోదించాలి. ఆ తరువాతే టెండర్లు పిలుస్తారు.

100 అడుగుల నుంచి 150 అడుగులకు

ప్రస్తుతం ఈ జాతీయ రహదారి 100 అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 7 మీటర్ల (21 అడుగులు) వెడల్పుతో బీటీ దారిని నిర్మించారు. కొత్తగా నాలుగు వరుసల దారికోసం 150 అడుగుల స్థలాన్ని సేకరించనున్నారు. అంటే ఇరుపక్కల 25 అడుగుల చొప్పున భూసేకరణ చేపట్టనున్నారు. కొన్ని చోట్ల అదనంగా ఇరుపక్కల అవసరాన్ని బట్టి మరో 10 అడుగుల ఎక్కువ స్థలం సైతం సేకరిస్తారు. దీన్నిబట్టి కొన్ని చోట్ల ఈ దారి 170 అడుగుల విస్తీర్ణం వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నాలుగు వరుసల దారికోసం మధ్యలో డివైడర్ ఏర్పాటుచేసి ఇరుపక్కల 7 మీటర్ల (21 అడుగులు) చొప్పున బీటీ దారి నిర్మిస్తారు.

మొక్కలు నాటుతున్న పంచాయతీ సిబ్బంది

ఈ దారి పొడవునా పంచాయతీ సిబ్బంది హరితహారం కింద మొక్కలు నాటుతున్నారు. ఇరుపక్కల ఈ కార్యక్రమమం కొనసాగుతోంది. త్వరలో నాలుగు వరుసల దారి పనులు మొదలు కానుండడంతో వీటిని తొలగించాల్సి ఉంటుంది. అందుకే మొక్కలు నాటే పనులను ఆపాలంటూ నిర్మల్‌లోని జాతీయ రహదారుల సబ్ డివిజన్ కార్యాలయం నుంచి జిల్లా పాలనాధికారికి లేఖ రాయడంతో ఈ మొక్కలు నాటే కార్యక్రమంపై సందిగ్ధత నెలకొంది.డిసెంబరు నాటికి ప్రక్రియ పూర్తిఈ విషయమై జాతీయ రహదారుల కార్యాలయ డీఈ సుభాష్‌తో మాట్లాడుతూ నాలుగు వరుసల దారి కోసం 2022-23 సంవత్సరం బడ్జెట్‌లో రూ.700 కోట్లు కేటాయించారన్నారు. భూసేకరణ కోసం ఇందులోనే నిధులు వెచ్చిస్తారన్నారు. భూములు కోల్పోయే వారికి రెవెన్యూ అధికారుల నిర్ణయం మేరకు పరిహారం అందిస్తారని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి మాత్రం ఈ డిసెంబరు నెలలోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు.

# తడబడుతున్న ప్రగతి చక్రం!



ఆసిఫాబాద్ : ఆర్టీసీ ప్రయాణికులపై భారం పెరుగుతున్నా.. సేవల్లో మాత్రం నాణ్యత లోపిస్తోంది. మూడు నెలల్లో డీజిల్ సెస్సు, రౌండప్ పేర్లతో ఛార్జీలు పెంచారు. ఏప్రిల్, మే నెలలో రూ.కోటి చొప్పున నష్టాన్ని చవిచూసిన ఆసిఫాబాద్ డిపో.. జూన్‌లో రూ.60 లక్షలకు తగ్గడం కొంత ఊరట కలిగిస్తోంది. కానీ ఖర్చులు పెరగడం, డీజిల్‌పై రాయితీని ఎత్తివేయడంతో సంస్థపై తీవ్ర ఆర్థిక భారంతోపాటు, ప్రయాణికుల సేవలపై ప్రభావం చూపుతోంది.

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో పల్లెవెలుగు నుంచి రాజధాని వరకు అన్ని రకాల బస్సులు సంస్థకు చెందినవి 52, అద్దెవి 19 వరకు ఉన్నాయి. నిత్యం వీటితో 30,286 కి.మీ.లు తిప్పాలి. కానీ సుమారు 27వేల కి.మీ. వరకే తిప్పుతున్నారు. రోజుకు రూ.13.50 లక్షల ఆదాయం రావాల్సి ఉండగా.. రూ.10 లక్షలే సమకూరుతోంది. సుమారు 16వేల మంది ప్రయాణికులు తమ తమ గమ్యస్థానాలకు చేరుతున్నారు.

కొరవడిన సమయపాలన..

సురక్షిత ప్రయాణానికి పెట్టింది పేరుగా ఉన్న ఆర్టీసీపై ప్రయాణికులు ఆదరణ చూపుతున్నా.. ఆ స్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమవుతోంది. ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చిన రాజధాని బస్సులో వానతో ఊరిచినట్లు అందులో ప్రయాణించిన వారు చెబుతున్నారు. ఏ బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు లేవు. జిల్లాలోని చాలా చోట్ల బస్టాండ్లు లేక రోడ్ల పక్కన, చెట్ల కింద ఎండా వానలకు ఎదురుచూడాల్సిన దుస్థితి. ఉదయం మంచిర్యాల, ఆదిలాబాద్ వైపు వెళ్లే, రాత్రి వేళ హైదరాబాద్‌కు వెళ్లే హైటెక్ బస్సుల సమయపాలన లోపిస్తోందనే విమర్శలు ఉన్నాయి.

ఛార్జీల్లో తేడా..

మేలో ఒకసారి, జూన్ 9న మరోసారి డీజిల్ సెస్, రౌండప్ పేర్లతో బస్సు ఛార్జీలు పెంచారు. 30 కి.మీ.లోపు ప్రయాణానికి పెంచనట్లు చెబుతున్నా.. రౌండప్ పేరుతో పెరగడంతో అదనపు భారం పడుతోంది. ఇది వరకు రూ.5, 15, 25.. ఇలా ఉన్న ఛార్జీలను రౌండప్ పేరుతో రూ.10, 20, 30.. పెంచారు. 30 కి.మీ. దాటితే మరింత ధరలు పెరిగాయి. ఆదిలాబాద్, హైదరాబాద్ మార్గాల్లో కంటే మహారాష్ట్ర మార్గంలో నడిచే బస్సులకు ఛార్జీల్లో తేడాతో ప్రయాణికులు నష్టపోతున్నారు. ఉదాహరణకు.. జిల్లా కేంద్రం నుంచి కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డుకు 15 కి.మీ.లు ఉంటుంది. దీని ఛార్జీ రూ.20 ఉంది. ఇందులో మార్పు చేయలేదు. అదే మహారాష్ట్ర మార్గంలోని వాంకిడి జిల్లా కేంద్రం నుంచి 15 కి.మీ. ఉంటుంది. గతంలో పల్లెవెలుగు టికెట్ ధర రూ.13 ఉండేది. రౌండప్ పేరుతో రూ.20 చేశారు. మరోసారి రూ.25 పెంచారు. జూన్ 9 నుంచి రూ.30 చేశారు. అంటే కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు, వాంకిడి జిల్లా కేంద్రం నుంచి ఒకే దూరంలో ఉన్నా.. టికెట్టు ధరలో రూ.పది తేడా ఉంది. నిత్యం వాంకిడికి రాకపోకలు సాగిస్తున్న ఉద్యోగులు, వ్యాపారులు, ఇతరత్రా వారిపై రూ.20 అదనపు భారం పడుతోంది. మహారాష్ట్ర మార్గంలో నడిచే బస్సులకు ఆ రాష్ట్రం అమలు చేస్తున్న ధరలనే ఇక్కడా అమలు చేస్తున్నట్లు అధికారులు చెప్పడం గమనార్హం.

తేడా సుస్పష్టంగా..

లి తడబడుతున్న ప్రగతి చక్రం! ఈ చిత్రంలో కనిపిస్తున్న టికెట్లలో ఒకటి ఆసిఫాబాద్ డిపోకు చెందిన పల్లెవెలుగు, మరొకటి మంథని డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సుది. జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రయాణికుడు ఇక్కడి పల్లెవెలుగు బస్సులో మహారాష్ట్రలోని రాజురాకు వెళ్లాడు. రూ.90 టికెటు ధర చెల్లించాడు. సాయంత్రం మంథని డిపోనకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో తిరిగి ఆసిఫాబాద్‌కు రాగా.. రూ.80 తీసుకున్నారు. అంటే ఒకే ఊరికి ఎక్స్‌ప్రెస్ బస్సు కంటే పల్లెవెలుగు బస్సు ఛార్జి రూ.పది అధికంగా ఉండటాన్ని గమనించవచ్చు.

# జాతీయ విపత్తుగా ప్రకటించేలా చొరవ చూపాలి

మణుగూరు : ఇటీవల గోదావరికి వచ్చిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి, కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి సహాయాన్ని అందించేలా రెండు తెలుగు ముఖ్యమంత్రులు కృషి చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సూచించారు. మణుగూరులో ప్రారంభమైన సీపీఐ జిల్లా మహాసభల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై విమర్శలు చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వాలు ప్రతిపక్షాలతోపాటు సామాన్య ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. భద్రాచలంలో వివాదంగా మారిన ఐదు పంచాయతీలను తక్షణమే తెలంగాణలో కలపాలన్నారు. అనంతరం కొత్తగూడెం మాజీ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ గోదావరి ఉద్ధృతి కారణంగా జిల్లాలో ముంపునకు గురైన మండలాల్లో పూర్తిస్థాయి పరిహారం అందించాలన్నారు. వారందరికీ తక్షణమే ఎత్తైన ప్రదేశంలో శాశ్వత నివాసాలు ఏర్పాటుచేయాలన్నారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు రాంప్రసాద్, బొల్లోజు అయోధ్య, హేమంతరాంవు, ప్రసాద్, లక్ష్మీకుమారి, జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఊళ్లోకి నీరు.. జనం బేజారు

నిర్మల్ : భారీ వర్షాలతో వరదలు ముంచెత్తుతుండటంతో జిల్లా కేంద్రం పేరులో ఉన్న 'నిర్మల'త్వం లోపిస్తోంది. స్థిరాస్తి వ్యాపారంతో చెరువుల కింది సాగు భూములన్నీ వెంచర్లుగా మారాయి. భూముల ధరలు పెద్ద మొత్తంలో పెరగడంతో ఇష్టారీతిన విలువైన కాలువలు, కందకాలు పలుచోట్ల ఆక్రమణల పాలవ్వడంతో రోడ్లు, కాలనీల్లోకి వరద పోటెత్తి ప్రజలు పలు కష్టాలెదుర్కొంటున్నారు.

ఎక్కడికక్కడ..

సాగు భూములను ప్లాట్లుగా చేసే సమయంలో ముందస్తు జాగ్రత్తలతో కనీస ప్రమాణాలు పాటించకుండా ఇష్టారీతిన ఏర్పాటు చేస్తూ తమ స్థిరాస్తి వ్యాపారం సాగిస్తున్నారే తప్ప ఆ తర్వాత జరిగే నష్టాలను పట్టించుకోవడం లేదు. చెరువులు, కుంటల అలుగులు, తూముల నుంచి వెళ్లే కాలువలను పూడ్చి ప్లాట్లుగా చేస్తున్నారు. చెరువుల భూములదీ అదే పరిస్థితి. కనీస నిర్వహణ లేక కురుస్తున్న భారీ వర్షాలకు పూర్తిస్థాయికి చేరుకొని కట్టల బలహీనమై ప్రమాదకరంగా



మారాయి.

ఇకనైనా..అలుగు, తూముల నుంచి నీళ్లు వెళ్లే కాలువలను పునరుద్ధరించాలి. మిగులు జలాలు సక్రమంగా వెళ్లేలా, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నిర్మాణాలు చేపట్టాలి.

కందకాలు, జౌళినాలాకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా రక్షణ కంచెలు, హద్దులు ఏర్పాటు చేసి గత విస్తీర్ణంతో కాలువలు అభివృద్ధి చేయాలి.

ప్లాస్టిక్, చెత్తాచెదారం వంటివి చేరి ప్రవాహానికి అడ్డుగా నిల్వకుండా అనువైన చోట్ల జాలీలు వంటివి ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తొలగించాలి.

మురుగు చెరువుల్లో చేరకుండా అనుకూలమైన పుర స్థలాలున్న ప్రాంతాల్లో సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించాలి.

చేప మనుగడకు, మత్స్యకారులకు తీవ్ర ఆటంకంగా మారిన గుర్రపుడెక్క తొలగింపునకు కార్యాచరణ రూపొందించాలి.

మినీ ట్యాంక్‌బండులుగా తీర్చిదిద్దితే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే అవకాశం ఉంది.

నిర్మల్‌లోని 11 గొలుసుకట్టు తటాకాల్లో ఒకటైన మంజులాపూర్‌లోని రాంసాగర్ (చిన్న) చెరువు ఇది. గతంలో సుమారు 300 ఎకరాల్లో పంట పొలాలు సాగయ్యేవి. స్థిరాస్తి వ్యాపారంతో సాగు భూములన్నీ వెంచర్లుగా మారి, పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలయ్యాయి. దీంతో ఇది పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. ఏళ్లు గడుస్తున్నా.. కనీస మరమ్మతులు చేయడం లేదు. కట్టపై ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తోంది. రెండింటిలో ఒక తూము ప్రస్తుతం పనిచేయడం లేదు. దీంతో కురిసిన భారీ వర్షాలకు అలుగు పొంగిపొర్లి సమీపంలోని ఇళ్లు, విజయనగర్ కాలనీకి వరద పోటెత్తింది.

వివరాలు..

గొలుసుకట్టు చెరువులు : 11
గతంలో ఆయకట్టు : సుమారు 1,800 ఎకరాలు
ప్రస్తుతం : 200 ఎకరాలు
కందకాల పొడవు : దాదాపు 5 కి.మీ.కు పైగా
జౌళినాలా పొడవు : దాదాపు 3 కి.మీ. వరకు

అప్పటి పాలకులు నిర్మల్ చుట్టూరా కందకాలను నిర్మించారు. ఒక్కో చోట దాదాపు 5-10 మీటర్ల వెడల్పు, 3-5 మీటర్ల లోతులో ఉండేవి. స్వర్ణ ప్రాజెక్టు జౌళినాలా ద్వారా చెరువులు నింపడంతోపాటు, పంటపొలాలు సస్యశ్యామలమయ్యేవి. ప్రస్తుతం కాలువలు, కందకాలు కబ్జాలకు గురై కుచించుకుపోయి మురుగు కాల్వలుగా మారాయి.

# ఇంటర్ పాఠ్యపుస్తకాలేవీ సారూ!

కొత్తగూడెం : విద్యార్థులు చదువుకునేందుకు, అధ్యాపకులు బోధించే పాఠాలు అర్థమయ్యేందుకు ఇంటి వద్ద పునఃశ్చరణ చేసుకునేందుకు పాఠ్యపుస్తకాలు ఎంతో అవసరం. అవి లేకుండా విద్యా బోధన కష్టం. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పుస్తకాలు లేకుండానే చదువులు సాగుతున్నాయి. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఏటా అందజేస్తారు. కానీ ఈ ఏడాది ఇంకా ఇవ్వలేదు. 2022-23 విద్యా సంవత్సరం జూన్ 15 నుంచి ఇంటర్ ద్వితీయ తరగతులు సాగుతున్నాయి. వీరికి కావాల్సిన పాఠ్యపుస్తకాలు గతేడాదిలో మిగిలి ఉన్న పుస్తకాలను అరకొరగా అందజేశారు. పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జులై ఒకటో తేదీన తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఒక్క పుస్తకం ఇవ్వకుండానే తరగతులు ప్రారంభించారు. నిబంధనల ప్రకారం పుస్తకాలను వేసవి సెలవుల్లోనే జిల్లాలకు సరఫరా చేయాల్సి ఉంటుంది. అనంతరం కళాశాలల్లో ప్రవేశాలు పొందిన వెంటనే అందజేయాలి.

విద్యార్థుల నిరీక్షణ: ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులంతా పేదలు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటారు. ఈ ఏడాది కొత్తగా కేజీబీవీల్లో, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ గురుకులాలను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన కోసం అప్‌గ్రేడ్ చేశారు. ఖమ్మం జిల్లాలో 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 46 సెక్టర్ కళాశాలల్లో(అన్ని రకాల గురుకుల జూనియర్ కళాశాలలు) 11,422 మంది విద్యార్థులకు 70,188 పాఠ్యపుస్తకాలు కావాల్సి ఉంది. భద్రాద్రి జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బా విద్యాలయాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాల గురుకులాలు 39 ఉన్నాయి. వీటిల్లో 7,102 మందికి 40 వేల పుస్తకాలు తెలుగు, ఆంగ్ల మాధ్యమ పుస్తకాలు రావాల్సి ఉంది. కొన్ని కళాశాలల్లో ప్రిన్సిపల్స్, అధ్యాపకులు సీనియర్ ఇంటర్ విద్యార్థుల నుంచి పాత పుస్తకాలను సేకరించి కొత్తగా చేరిన వారికి అందజేస్తున్నారు. ఇప్పటికైనా సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కళాశాలలు ప్రారంభమైనప్పటికీ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. సీనియర్ విద్యార్థుల నుంచి పాఠ్యపుస్తకాలను తీసుకొని కొత్తగా ప్రవేశం పొందుతున్న వారికి సర్దుబాటు చేస్తున్నాం. నూతన పాఠ్యపుస్తకాలు ఇంకా రాలేదు. సప్లిమెంటరీ పరీక్షల అనంతరం కొత్త పుస్తకాలొచ్చే అవకాశాలున్నాయి. అప్పటి వరకు పాత పుస్తకాలతో బోధన జరుగుతోంది.- సులోచనారాణి, డీఐఈవో




# విపక్షాల వ్యూహం ఇదేనా..?

దిల్లీ: వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో భాజపాను ఉమ్మడిగా ఎదుర్కొనే విషయంలో వ్యూహాన్ని రూపొందించడానికి ప్రతిపక్ష పార్టీలు ముహూర్తం ఖరారు చేశాయి. ఈ నెల 23న బిహార్‌లోని పట్నా వేదికగా విపక్ష నేతలు కీలక సమావేశం నిర్వహించనున్నారు. ప్రధానంగా అభ్యర్థుల ఎంపికలో ఓ ముఖ్యమైన ఎజెండాపై ఈ భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. అత్యధిక స్థానాల్లో భాజపాపై ద్విముఖ పోరుకు దిగాలని విపక్షాలు వ్యూహరచన చేస్తున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాలు చెప్పినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో కనీసం 450 స్థానాల్లో ఈ 'ద్విముఖ' వ్యూహాన్ని అమలు చేయాలని విపక్షాలు భావిస్తున్నట్లు సమాచారం. అంటే.. ఈ స్థానాల్లో భాజపా అభ్యర్థిపై ప్రతిపక్షాల్లో కేవలం ఒక పార్టీ నుంచే అభ్యర్థిని నిలబెడతారన్నమాట..! భాజపా వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. జూన్ 23న ఈ వ్యూహంపైనే ప్రధానంగా చర్చించే అవకాశాలున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

**వన్-టు-వన్ ఫార్ములా సాధ్యమేనా..? :** ఈ వ్యూహంలో భాగంగా ప్రాంతీయ పార్టీలు తమకు బాగా పట్టున్న నియోజకవర్గాల్లో భాజపాపై నేరుగా బరిలోకి దిగుతాయి. ఇక జాతీయ పార్టీలు .. అధికార భాజపాకు ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్, ఆయా జాతీయ పార్టీల అభ్యర్థులను నిలబెట్టనున్నారు. ఈ ఫార్ములాను తొలుత తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. అయితే, ఆచరణలో ఇది సాధ్యమేనా? అన్నదే ఇక్కడ ప్రధాన సమస్య. ఎందుకంటే జాతీయ స్థాయిలో విపక్షాలైన రెండు పార్టీలు.. కొన్ని రాష్ట్రాల్లో ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నాయి. దీంతో ఈ అంశంపైనా విపక్షాలు చర్చించనున్నట్లు సమాచారం.

**పట్నానే ఎందుకు..? :** విపక్షాల భేటీకి పట్నాకు వేదికగా ఎంచుకున్నందుకు ఓ కారణం ఉంది. ఈ నగరం విపక్ష రాజకీయాలకు హబ్‌గా పేరొందింది. గతంలోనూ ఇక్కడ ప్రతిపక్షాల సమావేశం జరిగింది. ఎమర్జెన్సీ తర్వాత నాటి అధికార కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో ఆ భేటీ జరిగింది. అయితే ఈసారి భాజపాకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ సమావేశంలో కాంగ్రెస్ కూడా పాల్గొననుంది. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ నేతృత్వంలో జరిగే సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ హాజరయ్యేందుకు అంగీకరించారు. ఇంకా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఝార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఎన్సీపీ, శివసేన (యూబీటీ) అధినేతలు శరద్‌పవార్, ఉద్ధవ్ ఠాక్రే తదితరులు హాజరుకానున్నట్లు బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, జేడీయూ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ లలన్ బుధవారం విలేకరులకు వెల్లడించారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాం ఏచూరి, దీపాంకర్‌లు కూడా ఈ భేటీలో పాల్గొననున్నట్లు తెలిపారు.





దిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటోన్న భాజపా ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని కొద్దినెలలుగా రెజ్లర్లు ఆందోళన నిర్వహించారు. కేంద్ర హోం మంత్రి, క్రీడల శాఖ మంత్రి జోక్యంతో ప్రస్తుతం దానికి తాత్కాలిక విరామం ఇచ్చారు. అయితే కుస్తీయోధుల ఫిర్యాదుతో దాఖలైన ఓ ఎఫ్ఐఆర్ విషయంలో కీలక విషయాలు ప్రచారంలోకి వస్తున్నాయి. ఈ క్రమంలో మైనర్ రెజ్లర్ పెట్టిన కేసుకు సంబంధించి ఆమె తండ్రి ఓ జాతీయ మీడియాతో మాట్లాడారు. వేధింపులకు గురైనట్లు చెప్తోన్న సమయంలో సదరు యువతి.. మైనర్ కాదని గుర్తించడంతో, మేజిస్ట్రేట్ ఎదుట ఆమె నుంచి మరోసారి వాంగ్మూలం తీసుకొన్నట్లు తెలుస్తోంది. వేధింపుల కేసు అలాగే ఉందని, ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించిన వయసుకు సంబంధించిన అంశంలో మార్పు చేశారని ఆ యువతి తండ్రి జాతీయ మీడియా సంస్థకు తెలిపారు. ఈ మార్పుతో బ్రిజ్‌భూషణ్‌పై ఉన్న పోక్సో అభియోగాలపై న్యాయస్థానం నిర్ణయం తీసుకోవాల్సిఉంది. ఆరుగురు రెజ్లర్లతో పాటు మైనర్‌గా పేర్కొన్న మరో యువతి ఫిర్యాదు ఆధారంగా దిల్లీ పోలీసులు ఏప్రిల్ 28న బ్రిజ్ భూషణ్ పై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మైనర్ తండ్రి ఎఫ్ఐఆర్ వెనక్కి తీసుకున్నట్లు ఇదివరకు వార్తలు వచ్చాయి. దానిపై అప్పుడే బజరంగ్ పునియా స్పందించారు. ఆ వార్తలపై తాము బాలిక తండ్రిని సంప్రదించగా.. ఆయన వాటిని తోసిపుచ్చారన్నారు. ఇదిలా ఉంటే.. నిన్న కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్‌తో దాదాపు అయిదు గంటలకు పైగా జరిగిన సమావేశంలో రెజ్లర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. బ్రిజ్‌భూషణ్‌పై ఈ నెల 15 లోపు ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని, జూన్ 30లోపు డబ్ల్యూఎఫ్ఐకి ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్రం పేర్కొంది. దాంతో ప్రభుత్వం కోరికమేరకు ఉద్యమాన్ని వారం పాటు నిలిపివేస్తున్నట్లు రెజ్లర్లు వెల్లడించారు.




దిల్లీ: శ్రద్ధావాకర్ హత్య కేసు దేశవ్యాప్తంగా ఎంత సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఇంకా దానిని మర్చిపోకముందే అదే తరహాలో మహారాష్ట్ర రాజధాని ముంబయిలో మరోకేసు వెలుగుచూసింది. తన సహజీవన భాగస్వామిని హత్యచేసి, ఆమె శరీర భాగాలను ముక్కలుగా చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాలు ప్రకారం.. 56 ఏళ్ల వయస్సున్న మనోజ్ సహానీ.. సరస్వతి వైద్యతో మూడేళ్లుగా సహజీవనంలో ఉన్నారు. వారిద్దరు ముంబయిలోని మీరా రోడ్డులోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. అయితే నిన్న వారు ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో సరస్వతి హత్య గురించి వెలుగులోకి వచ్చింది. ఆ ఇంట్లో మృతురాలి శరీర భాగాల ముక్కలను పోలీసులు గుర్తించారు. దాదాపు నాలుగు రోజుల క్రితమే ఆమె హత్య జరిగినట్లు వారు అంచనావేశారు. వారిద్దరి మధ్య జరిగిన గొడవే ఈ దారుణానికి కారణమై ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా వెల్లడించారు. ఈ హత్యను దాచిపెట్టేందుకు అతడు యత్నించాడని తెలిపారు. ఆమె శరీర భాగాల్లో కొన్నింటిని నిందితుడు కుక్కర్‌లో ఉడికించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ హత్యకు గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. 'మేం మృతురాలికి న్యాయం చేయడానికి కట్టుబడి ఉన్నాం. ఈ కేసుకు సంబంధించిన వివరాలు తెలిసినవారు మమ్మల్ని సంప్రదించాలని కోరుతున్నాం'అని డీసీపీ జయంత్ బజ్‌బలే స్థానికులను అభ్యర్థించారు. మనోజ్.. బోరివాలీ ప్రాంతంలో ఒక దుకాణం నడుపుతున్నాడని స్థానికులు తెలిపారు. మృతురాలు సరస్వతి అనాథగా గుర్తించారు. గత ఏడాది వెలుగులోకి వచ్చిన శ్రద్ధావాకర్ హత్యను తాజా ఘటన గుర్తుకుతెస్తోంది.

కాల్ సెంటర్ ఉద్యోగిని శ్రద్ధాను ఆమె సహజీవన భాగస్వామి అఫ్తాబ్ పూనావాలా అతి దారుణంగా హత్య చేసి, శరీరాన్ని 35 ముక్కలుగా చేశాడు. పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు ఆ భాగాలను 18 రోజుల పాటు దిల్లీలోని వివిధ ప్రాంతాల్లో పారేశాడు. ఆమె తండ్రి ఫిర్యాదుతో ఆరు నెలల తర్వాత అతడి అకృత్యం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ కేసు విచారణలో ఉంది.

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ.. శ్రీవారి దర్శనానికి ఎంత సమయం పడుతోందంటే..



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. నేడు (గురువారం) శ్రీవారి సర్వదర్శనానికి భక్తులు 31 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. స్వామివారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోంది.

నిన్న (బుధవారం) శ్రీవారిని 75,229 మంది భక్తులు దర్శించు కుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం 3.24 కోట్ల రూపాయలు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. స్వామివారికి 35,618 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

## టీడీపీ మహానాడుకు నాకు ఆహ్వానం లేదు : కేశినేని నాని కీలక వ్యాఖ్యలు

విజయవాడ : ఎంపీ కేశినేని నాని నేడు కీలక వ్యాఖ్యలు చేశారు. తాను తెలుగుదేశం పార్టీలో సభ్యుడిని మాత్రమేనన్నారు. తనకు ఎటువంటి పదవులూ లేవన్నారు. కేంద్ర హోం మత్రి అమిత్ షా, టీడీపీ అధినేత చంద్రబాబు కలయికపై తాను ఏమీ చెప్పలేనన్నారు. అభివృద్ధి విషయంలో తాను పార్టీలు చూడబోనన్నారు. అందరినీ కలుపుకుని ప్రజల కోసం పనిచేస్తానన్నారు. ఎవరో ఏదో తన మీద ప్రచారం చేశారని తాను స్పందించబోనన్నారు. తాను ఏదీ చేసినా మెచ్చుకునే వాళ్లు, తిట్టుకునే వాళ్లు ఉంటారన్నారు. తాను రాజకీయాల్లో ఏం చేస్తాననే దాని పై తనకు స్పష్టత ఉందని కేశినేని నాని తెలిపారు.

**నన్ను తిట్టినోళ్ల ఫొటోలు కూడా..** "మోదీ, చంద్రబాబు, జగన్‌లను మంచిగా, చెడుగా చూసేవాళ్లు ఉంటారు. సోషల్ మీడియాలో వాళు ఏదో ప్రచారం చేస్తే నాకు సంబంధం లేదు. ప్రజాప్రతినిధిగా గెలిచాక ప్రాంతం, ప్రజల అభివృద్ధి కోసం పని చేస్తా. నా గురించి ఎవరేమి అనుకున్నా నేను పట్టించుకోను. ప్రజలు కోరుకుంటే పార్టీ సీటు ఇవ్వకపోయినా ఇండిపెండెంట్‌గా గెలుస్తా అన్నాను.

అంతిమంగా గెలుపోటములు ప్రజలు నిర్ణయిస్తారు. నా పార్టీ కార్యాలయంపై బ్యానర్లు చూడండి. నన్ను తిట్టినోళ్ల ఫొటోలు కూడా నా ఫ్లెక్సీలో ఉన్నాయి. అసలు పార్టీలో ఇన్‌చార్జి లు ఎవరు...? వాళ్లంతా గొట్టంగాళ్లు. విజయవాడ ప్రజలంతా నాతో కంఫర్ట్ బుల్‌గా ఉన్నారు" అని కేశినేని నాని అన్నారు.

**మహానాడుకు నాకు ఆహ్వానం లేదు..** "టీడీపీ మాహానాడుకు నాకు ఆహ్వానం లేదు. నేను ఒక ఎంపీని... అక్కడ రామ్మోహన్ నాయుడికి




తప్ప ఇతర ఎంపీలకు పని లేదు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో టీడీపీ ఆఫీసు పెట్టారు. ఎంపీగా నాకు అసలు ఆహ్వానం లేదు.. మా పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వెళ్లారు. పార్టీ కార్యాలయం పెట్టిన వ్యక్తి.. పొలిట్ బ్యూరో సభ్యుడైన నన్ను పిలవ లేదు. ఇన్‌చార్జిల పేరుతో హడావుడి చేసే వాళ్లు గొట్టంగాళ్లు. ఢిల్లీకి చంద్రబాబు వస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. బాధ్యతగా వెళ్లి మా అధినేతను కలిశాను. బీజేపీ, టీడీపీ పొత్తు పై స్పందించే స్థాయి నాది కాదు. నాకు ప్రజల్లో మంచి పేరు ఉంది కాబట్టే అన్ని పార్టీల్లో నా పేరుపై చర్చ సాగుతోంది. ప్రస్తుతం నాకు పార్టీ మారే ఆలోచన లేదు.. చిర్రెత్తితే అప్పుడు ఆలోచిస్తా" అని కేశినాని నాని తెలిపారు.

## రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్‌పై హైకోర్టులో మరో పిటిషన్



అమరావతి: నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్‌పై ఏపీ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. సీఐడీ కోర్టు న్యాయమూర్తి ఆదేశాల మేరకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన వైద్య పరీక్షల నివేదికలు భద్రపరచాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. గురువారం హైకోర్టులో విచారణకు రావడంతో రఘురామ కృష్ణ రాజు తరపు న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, రేడియాలజీ వైద్యుల నివేదికలను భద్రపరచాలని న్యాయవాది కోరారు.

రెండు సంవత్సరాలు పూర్తి అవ్వడంతో ఈ నివేదికలను ధ్వంసం చేసేందుకు అధికారులు ప్రభుత్వ అనుమతి కోరినట్లు కోర్టు దృష్టికి లాయర్ తీసుకొచ్చారు. అలా చేస్తే ఈ కేసు దర్యాప్తులో కీలక ఆధారాలు మాయం అయిపోతాయని... వీటన్నింటినీ భద్రపరచి కోర్టుకు ఇవ్వాల్సిందిగా లక్ష్మీనారాయణ కోరారు. దీనిపై వెంటనే లిఖిత పూర్వక కౌంటర్లు దాఖలు చేయాలని గుంటూరు ఆసుపత్రి సూపరెండెంట్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఆరోగ్య శాఖ కమిషనర్‌లను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను హైకోర్టు ధర్మాసనం వచ్చే మంగళవారం(జూన్ 13)కు వాయిదా వేసింది.

## ఎన్నికల వేళ చంద్రబాబుకు భద్రతను తొలగించనున్నారా? డిప్యూటీ స్పీకర్ వ్యాఖ్యలు అందుకేనా?




తిరుమల : స్పీకర్, డిప్యూటీ స్పీకర్ వంటి ఉన్నత పదవిలో ఉన్న వారి నోటి నుంచి ఏదైనా మాట వచ్చిందంటే.. అది ప్రభుత్వ మాటగానే సాధారణంగా పరిగణిస్తూ ఉంటుంది ప్రజానీకం. నేడు ఏపీ డిప్యూటీ స్పీకర్ వీరభద్ర స్వామి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు భద్రతపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కనీసం సందర్భం కూడా లేకుండా ఆయన చంద్రబాబు భద్రత గురించి వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

అసలు వీరభద్రస్వామి ఏమన్నారంటే.. చంద్రబాబుకీ గతంలో బెదిరింపులు వున్నాయని ఇచ్చిన భద్రతని నేటికీ కొనసాగించడం సబబు కాదని స్పీకర్ తమ్మినేని సీతారాం గతంలో చెప్పారని గుర్తు చేశారు. ఇది కేవలం తమ్మినేని సీతారాం వ్యక్తిగత అభిప్రాయమేమీ కాదని.. రాష్ట్ర ప్రజల్లో చాలా మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ వీరభద్ర స్వామి పేర్కొన్నారు. సమయం, సందర్భం లేకుండా ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల వేళ చంద్రబాబుకి భద్రత తొలిగించేందుకు ఏమైనా ప్రభుత్వం స్కెచ్ గీస్తోందా? అందుకే తమ్మినేని సీతారాం, వీరభద్ర స్వామి వంటి ప్రభుత్వ పెద్దలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా? అనేది చర్చనీయాంశంగా మారింది.

## పశ్చిమగోదావరి జెడ్పీ చైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ ఏకగ్రీవ ఎన్నిక



పశ్చిమగోదావరి: ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీసీ మహిళ అయిన పద్మశ్రీ కి సీఎం జగన్ బీఫామ్ కేటాయించిన సంగతి తెలిసిందే. ఇవాళ జెడ్పీ చైర్మన్ పదవికి ఎన్నిక జరగ్గా.. ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీకి జిల్లా మంత్రులతో పాటు పలువురు నేతలు అభినందనలు తెలియజేశారు. "బీసీ మహిళగా నన్ను గుర్తించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు. సాధారణ గృహిణి నైన నాకు జెడ్పీటీసీగా అవకాశం ఇచ్చారు . కొప్పుల వెలమలకు పెద్దపీట వేస్తూ జడ్పీ చైర్మన్ పదవి ఇచ్చారు. మెరుగైన పాలన అందించి సీఎం జగన్‌కి మంచి పేరు తీసుకొస్తాను" అని గంటా పద్మశ్రీ చెప్పారు. సీఎం జగన్మోహన్ రెడ్డి మాట ఇచ్చినట్లే వెనుక బడిన వర్గాలకు అండగా నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ ,అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారం ఇచ్చి అండగా ఉంటున్నారు.

పార్టీ కోసం కష్ట పడ్డ ప్రతి కార్య కర్త కు మంచి భవిష్యత ఉంటుందని నిరూపించారు. ఒక బీసీ మహిళకు జెడ్పీ చైర్పర్సన్ పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించారు. **::ఎమ్మెల్యే ఆళ్ళ నాని**

బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. నాడు జడ్పీ చైర్మన్ గా నాకు వైఎస్సార్ రాజకీయ భవిష్యత్తు ఇస్తే.. నేడు మంత్రి గా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం ఇచ్చారు. ఉద్యోగులకు వరాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌ది. భారతదేశంలో ఉన్న ముఖ్యమంత్రులంతా మన రాష్ట్రం వైపు చూస్తున్నారు. ఈనాడు లాంటి టిష్యూ పేపర్ మరొకరి లేదు. మేము అప్పుల పాలు చేశాము అంటున్నారు. మరి ఆనాడు 20 వేల కోట్లు అప్పు చేసిన చంద్రబాబు... వారికి కనపడలేదు. 4500 కోట్లు పసుపు కుంకుమ రూపంలో డైవర్ట్ చేశారు చంద్రబాబు. బాబు చేసిన అప్పై మేము తీర్చు తున్నాము. **::: మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావు**

## ఈ-ఆటోలతో ఆర్థిక భారం తగ్గుతుంది: ఆదిమూలపు




అమరావతి: ఈ-ఆటోలతో మున్సిపాలిటీలపై ఆర్థిక భారం తగ్గుతుందని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. రాష్ట్రాన్ని క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న లక్ష్యంతో చిన్న మున్సిపాలిటీల్లోనూ చెత్త సేకరణకు పర్యావరణహితంగా ఉండే విద్యుత్తు ఆటోలను (ఈ-ఆటోలను) ప్రవేశపెట్టారు. గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెండా ఊపి వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "ఐదు క్వింటాళ్ల సామర్థ్యం కలిగిన వాహనాలను కొనుగోలు చేశాం. వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులను చేపట్టాం. కోటి 20 లక్షల డస్ట్‌బిన్‌లను అందించాం. తడి, పొడి చెత్త సేకరణకు ప్రత్యేక ఏర్పాటు చేశాం. మురుగు నీటిని శుద్ధి చేసే ప్రాజెక్టులను కూడా నిర్మిస్తున్నాం. రానున్న రోజుల్లో చెత్త రహిత రాష్ట్రం సాకారం అవుతుంది.

మున్సిపాలిటీల్లో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపు చేశాం.. కానీ ఎల్లో మీడియాలో విష ప్రచారం చేస్తున్నారు. రేపు గుడివాడలో టిడ్కో ఇళ్లు పంపిణీ చేస్తున్నాం. పేదలకు ఇళ్లు ఉండాలనేది సీఎం జగన్ లక్ష్యం" అని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.

## మెగా కాంపౌండ్ పై విసుర్లు.. వివరణ ఇచ్చిన శ్రుతి!

టాలీవుడ్ కోలీవుడ్ లో రాణిస్తూనే బాలీవుడ్ లోను నటిస్తోంది శ్రుతిహాసన్. మూడు పరిశ్రమల్లో కెరీర్ పరంగా ఉత్తమ అవకాశాలు దక్కింది తెలుగు చిత్ర సీమలోనే. ది బెస్ట్ అని చెప్పు కోదగ్గ చిత్రాల్లో నటించింది. ముఖ్యంగా తనకు 'గబ్బర్ సింగ్' రూపంలో తొలి బిగ్ బ్రేక్ నిచ్చింది తెలుగు పరిశ్రమే. దాంతో ఈ ఇండస్ట్రీని శ్రుతి ఎప్పుడూ సెంటిమెంటుగా భావించి గౌరవిస్తుంది. అలాగే తెలుగు స్టార్ల సరసన నటించడానికి ఎప్పుడూ భేషజం ప్రదర్శించదు. ఇటీవలే ఓ మెట్టు దిగి వచ్చి సీనియర్ స్టార్లు చిరంజీవి- బాలకృష్ణ సరసన కూడా నటించేసింది. టాలీవుడ్ సీనియర్ హీరోల కు హీరోయిన్లు దొరక్క ఇబ్బందికరంగా మారిందని ప్రచారమవుతున్న క్రమంలోనే తాను రూల్స్ ని బ్రేక్ చేస్తూ ఇద్దరు అగ్ర హీరోల సరసన ఒకే సీజన్ లో నటించి రెండు (సంక్రాంతి) బ్లాక్ బస్టర్లు అందుకుంది. ఇక కెరీర్ పరంగా ఎలాంటి డేరింగ్ డెసిషన్స్ తీసుకుంటుందో వ్యక్తిగత జీవితంలోను అలాంటి డేరింగ్ స్టెప్స్ తో నిరంతరం చర్చల్లో నిలుస్తోంది శ్రుతి. తాను ప్రేమించిన విదేశీ ప్రియుడు మైఖేల్ కోర్సలేని తన తండ్రి కమల్ హాసన్ కి పరిచయం చేసింది. ఆ తర్వాత అతడితో బ్రేకప్




అనంతరం డూడుల్ ఆర్టిస్ట్ శంతను హజారికాతో ప్రేమాయణం గురించి ఓ పెనైంది. ఇలా తన వ్యక్తిగత జీవితంలో ఏదీ దాచుకోని శ్రుతి కొన్నిసార్లు బోల్డ్ ప్రకటనలతో వివాదాల్లోకి వెళ్లింది. ఇటీవల స్టార్ హీరోలతో నటించేప్పుడు కొన్ని ఇబ్బందులున్నాయని మైనస్ డిగ్రీల చలిలో మంచు కొండల్లో ఎలాంటి ఆచ్ఛాదనా లేకుండా చలికి ఇబ్బందిపడుతూ డ్యాన్సులు చేయాల్సి వచ్చిందని నర్మగర్భంగా మాట్లాడింది శ్రుతి. అయితే ఇది మెగాభిమానులకు రుచించలేదు. మెగాస్టార్ వాల్తేరు వీరయ్య కోసం మంచు పర్వతాల్లో చిత్రీకరించిన పాట విషయమై శ్రుతి ఇలా కామెంట్ చేయడం ఎవరికీ నచ్చలేదు. తమ బాస్ చిరుని అంత మాట అంటుందా? అంటూ మెగా ఫ్యాన్స్ చిర్రుబుర్రులాడారు. తీవ్రంగా ట్రోలింగ్ చేసారు. అయితే చాలా సందర్భాల్లో తాను అనాలోచితంగా అలా సరదాగా లైటర్ వెయిన్ లో మాట్లాడేస్తానని దానిని సీరియస్ గా తీసుకోకూడదని తాజాగా ఈ వివాదం పై శ్రుతి స్పందించింది. తనని ట్రోల్ చేసే వారిని చూసి తన వ్యక్తిత్వాన్ని మార్చుకోలేనని కూడా పంచ్ విసిరింది. చెన్నైలో అభిమానులతో మీట్ అండ్ గ్రీట్ సందర్భంగా శ్రుతి ఈ వ్యాఖ్యలు చేసింది. సంవత్సరాలుగా మంచులో నటీమణులు డ్యాన్స్ సీక్వెన్స్ ల కోసం ఎలా ఇబ్బందిపడుతున్నారో వివరిస్తూ ఇది చాలా సవాల్ లాంటిదని ఇంతకుముందు శ్రుతి వ్యాఖ్యానించింది.

గతంలో చాలా మంది నటీమణులను సెంటిమెంట్ పాత్రల్లో చూపారని అలా నేటి నాయికలను తెర పై చూపాలని.. మరింత వాస్తవికంగా స్త్రీలను తెర పై చూపించాలని దర్శకనిర్మాతలను అభ్యర్థించింది. అయితే కొన్ని మీడియా వర్గాలు ఈ ప్రకటనలను తప్పుబట్టాయి. కానీ దానిని పట్టించుకోకుండా తన అనుభవాలను ఓపెన్ గా చెబుతానని ప్రకటించింది శ్రుతి.

## టాప్ యాంగిల్ క్లీవేజ్ షో తో రచ్చ చేస్తోంది

అల్లు అర్జున్ తో ఇద్దరమ్మాయిలు సినిమాలో నటించిన ముద్దుగుమ్మ కేథరిన్ తెర్సా పలు పెద్ద చిత్రాల్లో నటించినా కూడా కమర్షియల్ బ్రేక్ సొంతం చేసుకోలేక పోయింది. హీరోయిన్ గా చాలా సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నా స్టార్ హీరోలకి జోడిగా నటించే అవకాశాలు మాత్రం ఈ ముద్దుగుమ్మ సొంతం చేసుకోలేక పోతుంది. వరుసగా చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరచడం స్టార్ హీరోలకు జోడిగా అవకాశాలు రాకపోవడంతో ఈ అమ్మడి యొక్క కెరియర్ మొదటి నుంచి ఇప్పటి వరకు అలాగే ఉంది. అయితే అందాల ఆరబోత విషయంలో ఈ అమ్మడి యొక్క దూకుడు



మామూలుగా లేదు. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోత ప్రతి ఒక్కరిని సర్ప్రైజ్ చేసింది. టాప్ యాంగిల్ క్లీవేజ్ షో తో ఈ అమ్మడు చేసిన అందాల ఆరబోత చూపు తిప్పుకొనివ్వడం లేదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆకట్టుకునే ఫిజిక్ తో పాటు అలరించే స్కిన్ టోన్ ఈ అమ్మడి సొంతం.. అందుకే ఈమెకు సరైన సక్సెస్ లేకున్నా కూడా ఇన్నాళ్ళు ఇండస్ట్రీలో కొనసాగే అవకాశాలు దక్కుతున్నాయి అంటూ సినీ విశ్లేషకులు మరియు ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వారు అవుతున్నాయి. ఈ ఫోటోలు చూసిన తర్వాత అయినా ఫిలిం మేకర్స్ తమ సినిమాల్లో ఈమెకి ఆఫర్స్ ఇస్తారేమో... అలా అయినా ఈ అమ్మడు బిజీ అయ్యేనో చూడాలి.




## జిమ్ లో చెమటలు చిందిస్తున్న సమంత..!



హీరోయిన్ల లైఫ్ స్పాన్ చాలా తక్కువ. వరసగా పది సినిమాలు చేశారు అంటే ఆ తర్వాత వాళ్లకు అవకాశాలు తగ్గిపోతాయి. అందుకే హీరోయిన్లు కూడా తమకు సమయం దొరికినప్పుడే డబ్బు సంపాదించుకుంటారు. లేదు తమ కెరీర్ ఇంకా ముందుకు సాగాలి అనుకున్నవారు మరింత కష్టపడతారు. ఎంత కష్టమైనా జిమ్ లో శ్రమించి చెమటోడ్చి తమ ఫిజిక్ ని కాపాడుకుంటూ ఉంటారు. వ్యాయామాలు చేయడం వల్ల అందంగా ఫిట్ గా తయారవ్వచ్చు. అందుకే దాని కోసం చాలా ఎక్కువ కష్టమైనా పడుతూ ఉంటారు. అలా జిమ్ లో ఎన్ని గంటలైనా వర్కౌట్ చేయడంలో టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ముందుంటుంది. ఆమె ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి దాదాపు దశాబ్దం దాటింది. అయినా ఇప్పటికీ క్రేజీ ఆఫర్లు అందుకుంటోంది అంటే ఆమె నటనా ప్రావీణ్యంతో పాటు అందం పిట్నెస్ కూడా కారణం అని చెప్పొచ్చు. ఆమె తన ఫిట్నెస్ కోసం ప్రాణం పెట్టేస్తుంది. ఎప్పటికప్పుడు సమంత తాను జిమ్ లో కష్టపడుతున్న వీడియోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా కూడా ఆమె కొన్ని ఫోటోలు వీడియోలు పంచుకున్నారు. తన కాళ్ల మజిల్స్ పెంచుకునేందుకు ఆమె ఓ కఠిన వ్యాయామం చేస్తోంది. అది కూడా 100 టైమ్స్ రిపీట్ చేయడం గమనార్హం. తన మజిల్ షేప్ కోసం ఆమె పడుతున్న కష్టం చూస్తుంటే ఎవరైనా షాక్ అవ్వాల్సిందే. ఇదిలా ఉండగా ప్రస్తుతం సమంత శివ నిర్వాణ దర్శకత్వంలో ఖుషీ సినిమాలో నటిస్తోంది. ఈ మూవీలో ఆమె విజయ్ దేవర కొండ సరసన నటిస్తోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ టర్కీలో జరుగుతోంది. మరోవైపు సమంత సిటాడెల్ ఇండియన్ వర్షెన్ లోనూ నటిస్తోంది. కాగా ఆమెకు హాలీవుడ్ ఆఫర్లు కూడా క్యూ కడుతున్నాయి. ఇప్పటిచే చెన్నై స్టోరీ అంటూ ఓ ఆఫర్ చేజిక్కించుకుంది. ఇవి కాకుండా మరిన్ని ఆఫర్లు కూడా వస్తున్నట్లు సమాచారం. దాని కోసం ఆమె టర్కీలోనే ఉండి ఆడిషన్స్ ఇస్తున్నట్లు తెలుస్తోంది.

## ఆ హీరోయిన్ తో సల్మాన్ పెళ్లి ప్రపోజల్.. కానీ ట్విస్ట్ ఏంటంటే..!





బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ ఓ హీరోయిన్ ని చూసి ఇష్టపడి పెళ్లి ప్రపోజల్ కూడా పంపించాడట కానీ ఆ హీరోయిన్ తండ్రి అతనికి ఇచ్చి పెళ్లి చేయడం ఇష్టం లేదని చెప్పాడట. ఇంతకీ ఇది ఎప్పుడు జరిగింది. అసలు ఏంటీ కథ అంటే.. సల్మాన్ ఖాన్ అప్పుడే స్టార్ గా ఎదుగుతున్న రోజుల్లో అప్పుడే ఎంట్రీ ఇచ్చిన జూహీ చావ్లాని చూసి ఇష్టపడ్డాడట. ఆమె వ్యక్తిత్వం నచ్చి ఆమెను పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడట సల్మాన్ ఖాన్ కానీ ఆమె తండ్రి మాత్రం అందుకు నో చెప్పారట. చేసేదేమి లేక సైలెంట్ అయ్యారట సల్మాన్ ఖాన్. ఒకప్పటి తన ప్రేమ పెళ్లి కథని ఆమధ్య ఓ ఇంటర్వ్యూలో చెప్పి సర్ ప్రైజ్ చేశారు సల్మాన్ ఖాన్. ఇండియన్ సెలబ్రిటీస్ లో వెరీ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ ఎవరంటే సల్మాన్ ఖాన్ పేరే వినిపిస్తుంది. 56 ఏళ్ల సల్మాన్ ఖాన్ ఇప్పటికీ పెళ్లి చేసుకోలేదు. అయితే కెరీర్ మొదట్లోనే జూహీ చావ్లా మీద తన ఇష్టాన్ని తెలుపగా ఆమె ఫాదర్ మాత్రం అందుకు నిరాకరించాడట. సో అలా సల్మాన్ ఖాన్ పెళ్లి జరగకుండా ఆగింది. అయితే ఈ వార్తల పై జూహీ చవ్లా కూడా స్పందించింది. తాను అప్పుడే సినిమాల్లోకి రావడం తో పాటుగా సల్మాన్ కూడా కెరీర్ స్టార్టింగ్ లో ఉన్నాడు. అందుకే తన తండ్రి అలా చెప్పాడని కవర్ చేసింది. అయితే సల్మాన్ ఖాన్ జుహీ చావ్లా కలిసి 1997లో కలిసి సినిమా చేశారు. కానీ 1995లోనే జూహీ చావ్లాకి బిజినెస్ మెన్ జే మెహతాతో పెళ్లైంది. సో అలా సల్మాన్ ఖాన్ సోలోగానే ఉండిపోయాడు. సల్మాన్ ఖాన్ పెళ్లిపై వార్తలు రాసి రాసి అసలు సల్మాన్ కి పెళ్లి చేసుకునే ఉద్దేశం ఉందో లేదో అని లైట్ తీసుకున్నారు. ఇప్పటికీ ఫలానా హీరోయిన్ తో సల్మాన్ ఖాన్ డేటింగ్ అంటూ వార్తలు వస్తుంటాయి కానీ భాయ్ మాత్రం పెళ్లి చేసుకోవడంలో మాత్రం ముందడుగు వేయట్లేదు. బ్యాచిలర్ గానే ఉండిపోదామని ఫిక్స్ అయ్యాడు అనుకుంటా అందుకే పెళ్లంటే మాత్రం నోరు విప్పట్లేదు సల్మాన్ ఖాన్.

## మేకప్ ఎక్కువైనా స్కిన్ షో తో చంపేస్తోంది

సీతారామం సినిమా తో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ఉత్తరాది ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ స్కిన్ షో విషయంలో ఏమాత్రం తగ్గడం లేదు. ఆకట్టుకునే ఈ అమ్మడి ఫిజిక్ తో మైమరపించే స్కిన్ షో చేస్తూ ఈ అమ్మడు చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. ఈ మధ్య కాలంలో ఇన్ స్టా గ్రామ్ లో సెగలు పుట్టిస్తోంది. తాజాగా విభిన్నమైన మేకోవర్ తో ఈ అమ్మడు షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. మేకప్ విషయంలో కొందరు ట్రోల్స్ చేస్తున్నారు కానీ స్కిన్ షో కి ఫిదా అవుతున్నారు. ఆన్ స్క్రీన్ లో ఎంతో పద్దతిగా కనిపించే మృణాల్ ను ఇలా చూస్తూ ఉంటే సర్



ప్రైజింగ్ గా అనిపిస్తుంది అంటూ ఈ అమ్మడి అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. క్లీ వేజ్ షో తో పాటు స్కిన్ షో చేసిన ఈ ఫొటోలను నెటిజన్స్ తెగ షేర్ చేస్తున్నారు. కొందరు సీతారామం లోని సీతను అభిమానించే వారు మాత్రం మరీ ఇంతగా స్కిన్ షో అవసరమా మృణాల్ అంటూ ప్రశ్నిస్తున్నారు.

మొత్తానికి ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ యొక్క ఫొటోలు ఏదో ఒక విధంగా వైరల్ అవుతూనే ఉన్నాయి. ఇక ఈ అమ్మడు వరుసగా హిందీలో సినిమాలు చేస్తూనే ఉంది. తాజాగా కూడా ఒక హిందీ సినిమా తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నాని తో తెలుగు లో తన రెండవ సినిమాను చేస్తోంది. ఆ సినిమా షూటింగ్ ఇటీవలే ప్రారంభం అయినట్లుగా సమాచారం అందుతోంది. తెలుగు లో ఈ అమ్మడు ఆచి తూచి కథలను ఎంపిక చేసుకుంటుంది. అందుకే సీతారామం తర్వాత కేవలం నాని సినిమాకు మాత్రమే ఓకే చెప్పింది.

## బ్లాక్ డ్రెస్సులో రకుల్ బ్లాస్టింగ్ అందాలు..!

కెరటం సినిమాతో తెలుగు సినీ రంగంలో అడుగు పెట్టిన రకుల్ ప్రీత్ సింగ్.. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఆ తర్వాత వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ లో ప్రార్థనగా నటించి.. తెలుగు సినీ ప్రేక్షకుల మదిలో స్థానం సంపాధించుకుంది. ఆ తర్వాత మరెన్నో చిత్రాల్లో నటించి టాలీవుడ్ ను ఓ ఊపు ఊపిన ఈమె.. ఇప్పటికీ చాలా సినిమాల్లో నటిస్తూ బిజీగా గడుపుతోంది. యంగ్ హీరోలతో పాటు సీనియర్ హీరోల సరసన నటించి మెప్పిస్తోంది. తెలుగులో రకుల్ ప్రీత్ సింగ్ నటించిన చాలా సినిమాలు సూపర్ హిట్ కొట్టాయి. అందం అభినయం అదృష్టం అన్నీ ఉండటంతో చూస్తుండగానే చక చకా సినిమాలు చేసేసి అగ్ర కథానాయికగా మారిపోయింది. ఆ తర్వాత ఇతర ఇండస్ట్రీల వైపు ఈ బ్యూటీ దృష్టి పెట్టింది. బాలీవుడ్ వైపు వెళ్లిపోయింది. అక్కడా పలు చిత్రాలు చేస్తూ బిజీ బిజీగా మారింది. ఈ క్రమంలోనే సామాజిక



మాధ్యమాల ద్వారా అందరితోనూ టచ్ లో ఉంటుంది. ఎప్పటికప్పుడు తన పర్సనల్ ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటుంది. అయితే తాజాగా ఇన్ స్టాగ్రామ్ వేధికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. అందులో అదిరిపోయే ఔట్ ఫిట్ లో కనిపించి కుర్రకారు గుండెల్లో హీటు పుట్టిస్తోంది. నడుము ఒంపుసొంపులు చూపిస్తూ.. నెట్టింట రచ్చ చేస్తోంది. బ్లాక్ కలర్ సింగిల్ పీస్ వేసుకొని నెట్టింటిని షేక్ చేస్తోంది. నలుపు రంగు డ్రెస్సులో అందమైన చందమామలా మెరిసిపోతోంది. బ్లాక్ కలర్ డ్రెస్సుతో పాటు బ్లాక్ కలర్ షూ వేసుకొని థైస్ అందాలను తిప్పి తిప్పి చూపిస్తోంది. ఎద ఎత్తులూ కనిపించేలా ఫొటోలకు ఫోజులు ఇచ్చింది. నెట్టింట అందాలు ఆరబోస్తూ.. కుర్రాళ్ల మతి పోగొడుతుంది. ఈమె ఫొటోలు షేర్ చేసిన కొన్ని గంటల్లోనే లక్షల్లో లైకులు వచ్చాయి. మరోవైపు ఈమె ఫొటోలు చూసిన కుర్రకారు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. అందం అంటే నీవంటూ కొందరూ.. చందమామలా మెరిసిపోతున్నావంటూ మరికొంత మంది చెబుతున్నారు. ఈ డ్రెస్సులో చాలా సన్నగా కనిపిస్తున్నావంటూ ఐ లవ్ యూ హాట్ బ్యూటీ హాట్ నెస్ ఓవర్ లోడెడ్ అంటూ కామెంట్లు చేస్తున్నారు.



# వేములలో ఎస్‌జీడీ ఫార్మా కార్నింగ్ టెక్నాలజీ ప్లాంట్‌కు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన

మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మూసాపేట మండలం వేములకు చేరకున్న మంత్రి కేటీఆర్.. ఎస్‌జీడీ ఫార్మా కార్నింగ్ టెక్నాలజీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మైక్రో రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్‌లో మున్సిపల్ పార్కు, ఓపెన్ జిమ్‌లను ప్రారంభించారు. **మంత్రి మల్లారెడ్డి మాట్లాడాక మాట్లాడితే యాటకూర తిన్నాక.. తోటకూర తిన్నట్టుంటది :** మంత్రి మల్లారెడ్డి మాట్లాడిన తర్వాత నేను మాట్లాడితే.. యాటకూర తిన్నాక.. తోటకూర తిన్నట్లు ఉంటదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. అడ్డాకుల మండలం వేముల– పొన్నకల్ గ్రామ శివారులో యస్‌జీడీ కార్నింగ్ టెక్నాలజీ కంపెనీ రెండవ యూనిట్‌కు మంత్రి కేటీఆర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దేవరకద్రలో అప్పుడు 2014లో కేవలం 40 వేల ఎకరాల భూమికి సాగు నీరు అందేదని.. ఇపుడు ఎక్కడికక్కడ 30 చెక్ డామ్ లు కట్టడంతో.. లక్ష ఎకరాలకు సాగు నీరు అందుతోందన్నారు. కర్వెన పూర్తి అయితే మరో 60 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. ఎన్నికలు వస్తే బీజేపీ.. కాంగ్రెస్ వాళ్లు గంగిరెద్దుల వాళ్లు వచ్చినట్లు వస్తారని.. మోసపూరిత మాటలు చెబుతారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రైవేట్ కంపెనీలు వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. ప్రైవేట్ కంపెనీల యాజమాన్యాలను మనం కంటికి రెప్పలా కాపాడాలన్నారు. జీవశాస్త్ర విజ్ఞాన పెట్టుబడుల హబ్‌గా తెలంగాణ విరాజిల్లుతుందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ అడవుల సంరక్షణ చర్యలతో రాష్ట్రంలో పెరిగిన వన్యప్రాణుల సంఖ్య: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి





నిర్మల్: రాష్ట్రంలో అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పచ్చదనం పెంపునకు సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలు నాటుతున్నామని, ఇప్పటికే లక్ష్యాన్ని అధిగమించామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు. ప్రతీ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నామన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని చించోలి–బీ సమీపంలోని గండిరామన్న హరితవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన జంగల్ సఫారీని మంత్రి ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సఫారీ వాహనాన్ని స్వయంగా 5 కిలోమీటర్లు నడిపారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అడవుల సంరక్షణ చర్యల వల్ల వన్యప్రాణుల సంఖ్య పెరగిందని, మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వ్ నుంచి కవ్వాల్ టైగర్ రిజర్వ్ జోన్‌కు పులులు వలస వచ్చి ఆవాసం ఏర్పాటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రాన్ని పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెస్తున్నామని మంత్రి ఇంద్రకరణ్ అన్నారు. అడవుల ప్రత్యేకత కాపాడుతూనే.. పర్యావరణ హిత టూరిజాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గండిరామన్న హరితవనంలో సందర్శించే వారికి సరికొత్త అనుభూతిని కల్పించేందుకు రెండు ప్రత్యేక ఓపెన్‌టాప్ సఫారీ వాహనాలతో పాటు పెట్రోలింగ్ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. వీటి కోసం రూ.39 లక్షల వెచ్చించామని తెలిపారు. అర్బన్‌పార్కులో జంగల్ సఫారీని నిర్వహించడం అద్భుతంగా ఉందని కొనియాడారు. పార్కులో అడ్వెంచర్ కార్యక్రమాలతో పాటు పిల్లలు, పెద్దలందరికీ ఆహ్లాదం, వినోదం కలిగించేలా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. హరితవనంలో కోతుల సంరక్షణ, పునరావాస కేంద్రం, మూషిక జింకల పార్కు, చైన్ లింక్, ఎకో హట్స్, సైక్లింగ్, వాచ్ టవర్స్ చిన్న పిల్లల ఆట స్థలం లాంటి సౌకర్యాలను సందర్శకుల కోసం ఇప్పటికే అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న నిర్వహించనున్న హరితోత్సవ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

# కర్ణాటక రిజల్ట్ తెలంగాణలో పునరావృతం



నిజామాబాద్: తెలంగాణలో ఏం సాధించారని ఉత్సవాలు జరుపుకుంటున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటక రిజల్ట్ తెలంగాణలో పునరావృతం అవుతాయని అన్నారు. ధరణితో భూ స్వాములు బాగు పడ్డారని.. పేద రైతులు కాదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణిని తొలగిస్తామని స్పష్టం చేశారు. రైతులకు రూ. 2 లక్షలు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. పక్క రాష్ట్రాలలో మునిసిపల్ కౌన్సిలర్ గెలువని పార్టీ జాతీయ పార్టీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు పార్టీ కార్యాలయాలకు డబ్బు ఎక్కడిదని.. అది కేవలం ప్రజలదని అన్నారు. బడా కంపెనీలకు కట్ట పెట్టిన స్థలాన్ని ప్రజలకు పంచి పెడతామని తెలిపారు. 9 ఏండ్ల పాలనలో ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఏం సాధించారని బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు ఓట్లు అడుగుతారని నిలదీశారు. 100 రోజుల్లో పసుపు బోర్డ్ అని చెప్పిన ఎంపీ అరవింద్ ఎటు పోయారని మహేష్ కుమార్ ప్రశ్నించారు.

## అందుకే మన మిషన్ కాకతీయ దేశానికే ఆదర్శమయింది: మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్: నాటి పాలకుల నిర్లక్ష్యంతో గొలుసుకట్టు వ్యవస్థ చిన్నాభిన్నమైందని మంత్రి హరీశ్ రావు అన్నారు. నేడు సీఎం కేసీఆర్ చేపట్టిన మిషన్ కాకతీయతో చెరువులు పునరుజ్జీవం సంతరించుకున్నాయని చెప్పారు. అందుకే మన మిషన్ కాకతీయ దేశానికే ఆదర్శం అయిందని తెలిపారు. మిషన్ అమృత్ సరోవర్ పేరుతో మిషన్ కాకతీయను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని ట్వీట్ చేశారు. 'నాడు ఎండి పోయిన చెరువులు.. నేడు నిండు కుండల్లా చెరువులు.. నాటి పాలకుల నిర్లక్ష్యంతో గొలుసుకట్టు వ్యవస్థ చిన్నాభిన్నం.. నేడు సీఎం కేసీఆర్ చేపట్టిన మిషన్ కాకతీయతో చెరువుల పునర్జీవం. అందుకే మన మిషన్ కాకతీయ దేశానికే ఆదర్శం అయ్యింది. అమృత్ సరోవర్‌గా దేశ వ్యాప్తంగా అమలవుతోంది. తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది' అని మంత్రి హరీశ్ రావు తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశారు.

# నల్గొండ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీరు ఇచ్చారా?



నల్గొండ: కాంగ్రెస్ హయాంలో తెచ్చిన 2013 భూ నిర్వాసితుల చట్టంలో భూ నిర్వాసితులకు అన్ని సదుపాయాలు పొందుపర్చామని కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం మొత్తం భూ నిర్వాసితుల సమస్యలు ఉన్నాయన్నారు. భూ రికార్డులను భద్రపరిచే రెవెన్యూ చట్టాన్ని చిన్నాభిన్నం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు 30 కిలో మీటర్లు చేపడితే బీఆర్ఎస్ తొమ్మిదేళ్ళ పాలనలో 3 కిలోమీటర్లు తవ్వారన్నారు. తొమ్మిదేళ్ళ పాలనలో నల్గొండ జిల్లాకు ఒక్క ఎకరానికైనా నీరు ఇచ్చారా... ఏమి సాధించారని సాగునీటి ఉత్సవాలు అని ప్రశ్నించారు.

పాలకులు కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టుల వద్ద ఫోటోలు దిగుతున్నారన్నారు. ఎంపీగా, ఎమ్మెల్సీగా, మండలి చైర్మన్‌గా గుత్తా ఏమి తెచ్చారని.. ప్రగతి భవన్ మెట్లు ఎక్కడానికి, కేసీఆర్‌ను కలవడానికి భయపడతారని భట్టి విక్రమార్క వ్యాఖ్యలు చేశారు.




మృగశిర కార్తె సందర్భంగా చేపలు తినే ఆనవాయితీతో.. బుధ, గురువారాల్లో చేపల మార్కెట్లలో రద్దీ పెరిగింది. హైదరాబాద్‌లోని చేపల మార్కెట్లన్నీ ప్రజలు, వ్యాపారస్థులతో కిక్కిరిశాయి. ముషీరాబాద్ వద్ద రాంనగర్ చేపల మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది.




## ప్రపంచ వ్యాప్తంగా 202వ స్థానం
## దేశీయంగా ముంబయికి అగ్రస్థానం
## అంతర్జాతీయంగా అగ్రస్థానంలో హాంకాంగ్

దిల్లీ: భారత్‌లో విదేశీయులకు అత్యంత ఖరీదైన నగరాల్లో హైదరాబాద్‌కూ చోటు లభించింది. దేశీయంగా చూస్తే ఈ జాబితా అగ్రస్థానంలో ముంబయి నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో దిల్లీ, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, పుణె ఉన్నాయని 'మెర్సర్స్ 2023 కాస్ట్ ఆఫ్ లివింగ్ సర్వే' చెబుతోంది. ప్రతి నగరంలో వసతి, రవాణా, ఆహారం, దుస్తులు, గృహోపకరణాలు, వినోదం వంటి 200 వరకు అంశాలకయ్యే వ్యయాలను పరిగణనలోకి తీసుకుని, ఈ జాబితా రూపొందించారు. **అయిదు ఖండాల్లోని 227 నగరాల్లో జరిపిన ఈ సర్వేలోని ముఖ్యాంశాలు..** ప్రపంచం మొత్తం మీద ఖరీదైన నగరాల్లో ముంబయికి 147వ స్థానం దక్కింది. దిల్లీ 169, చెన్నై 184, బెంగళూరు 189, హైదరాబాద్ 202, కోల్‌కతా 211, పుణె 213వ స్థానాల్లో నిలిచాయి. అంతర్జాతీయంగా చూస్తే హాంకాంగ్, సింగపూర్, జూరిచ్ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. చాలా తక్కువ ఖరీదైన ప్రాంతాల్లో హవానా (ఈ ఏడాది ఇది 83 స్థానాలు కోల్పోయింది), పాకిస్థాన్‌లోని కరాచీ, ఇస్లామాబాద్ ఉన్నాయి. ముంబయితో పోలిస్తే చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా, పుణెల్లో వసతి ఖర్చులు 50 శాతం తక్కువగా ఉన్నాయి. విదేశీ ఉద్యోగులకు కోల్‌కతాలో అత్యంత తక్కువ వసతి ఖర్చులున్నాయి. అంతర్జాతీయ ర్యాంకింగ్‌లో భారత నగరాల స్థానాల్లో మార్పులు కనిపించాయి. కరెన్సీ ఊగిసలాటలు, ఐరోపా వంటి ప్రాంతాల్లో వస్తువులు, సేవల ధరల్లో మార్పులు ఇందుకు కారణంగా నిలిచాయి. విదేశాల్లో కార్యకలాపాలు నిర్వహించుకోవాలనుకునే బహుళ జాతి కంపెనీ(ఎమ్ఎన్‌సీ)లకు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో షాంఘై, బీజింగ్, టోక్యోలతో పోలిస్తే ముంబయి(147), దిల్లీ(169) వ్యయాల పరంగా మంచి గమ్యస్థానాలుగా నిలుస్తున్నాయి. ఆసియాలో అత్యంత ఖరీదైన అగ్రగామి 35 నగరాల్లో ముంబయి, దిల్లీ నిలిచాయి. ఆసియా నగరాల్లో ముంబయి స్థానం గతేడాదితో పోలిస్తే ఒక స్థానం తగ్గి 27కు చేరింది.

# ప్రశ్నపత్రాల లీకేజీ కేసు.. తండ్రీకుమారుడికి బెయిల్ మంజూరు




హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో మరో ఇద్దరికి బెయిల్ లభించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న తండ్రీకుమారుడు మైబయ్య, జనార్దన్‌లకు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో ఈ ఇద్దరు నిందితులను ఏప్రిల్ 21న సిట్ అధికారులు అరెస్టు చేశారు.

డాక్యా నాయక్ నుంచి తన కుమారుడి కోసం ఏఈ ప్రశ్నపత్రాన్ని మైబయ్య రూ.2 లక్షలకు కొనుగోలు చేసినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. తాజాగా ఈ ఇద్దరికి బెయిల్ మంజూరు చేయడంతో ఈ కేసులో ఇప్పటివరకు బెయిల్ పొందిన వారి సంఖ్య 17కు చేరింది.

# భూత్పూర్‌లో మున్సిపల్ పార్కు, ఓపెన్ జిమ్ ప్రారంభించిన మంత్రి కేటీఆర్




మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటిస్తున్నారు. దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్‌లో మున్సిపల్ పార్కు, ఓపెన్ జిమ్‌లను ప్రారంభించారు. అనంతరం మూసాపేట మండలం వేముల, మహబూబ్‌నగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో భూత్పూర్ చేరుకున్న మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డికి మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గువ్వల బాలరాజు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మూసాపేట మండలం వేములలోని ప్రైవేటు కంపెనీ యూనిట్‌కు, మైక్రో రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మణానికి, మహబూబ్‌నగర్‌లోని బాలికల ఐటీఐలో శంకుస్థాపన చేయనున్నారు. తర్వాత అక్కడే ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు జడ్చర్లలోని ఎర్రగుట్టలో డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించి, లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

# చెరువుల పండగతో గ్రామాల్లో పండగ వాతావరణం



నిజామాబాద్: చెరువుల పండగతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. గురువారం ఎడపల్లిలో ఊరూరా చెరువుల పండగ కార్యక్రమంలో కవిత పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ... 60 ఏళ్ల క్రితం వరకు తెలంగాణ పల్లెలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. స్వరాష్ట్రంలో ప్రగతి అమోఘమన్నారు. ఆంధ్రా పాలకులు నీటి వనరులు కొల్లగొట్టారని విమర్శించారు. రైతుల సంపదతో అన్నిటా సంపద కలుగుతుందన్నారు. రాష్ట్రంలో ఏదోఒక సంక్షేమ పథకం పొందని ఇల్లు లేదని తెలిపారు. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు తన సొంత ఊరిలో ఒక్కరికి కూడా పించన్ ఇవ్వలేదన్నారు. వడ్డించే వాళ్ళు మన వాళ్ళు కాబట్టే సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని చెప్పారు. ఇళ్ల స్థలాలు ఉన్నవారికి త్వరలో గృహలక్ష్మి పథకం ద్వారా డబ్బులు ఇస్తామన్నారు. గొలుసు కట్టు చెరువులను ప్రాజెక్టు నీళ్లతో నింపుతున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు లొల్లి పెట్టడానికే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో 9 ఏళ్లలో 12 వేల కోట్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. తెలంగాణ పథకాలను అన్ని రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని తెలిపారు. అమృత సరోవర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చెరువుల అభివృద్ధి చేపట్టిందని.. కానీ పది శాతం కూడా నిధులు ఇవ్వలేదని కవిత వ్యాఖ్యలు చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com